
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం, 16 ఏప్రిల్ 2024



ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	38.4	27.0
కావలి	37.0	26.0
కందుకూరు	38.0	26.0
ఆత్మకూరు	41.0	27.0
ఉదయగిరి	40.0	24.0

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.98 టీఎంసీలు కాగా సోమవారానికి ప్రాజెక్టులో 8.560 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 320, డెల్టాకు 300, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

18 నుంచి నామినేషన్లు

- ఈ నెల 25వ తేదీ వరకు స్వీకరణ
- 29 వరకు ఉపసంహరణ.. అదేరోజు జాబితా ప్రచురణ
- జిల్లా ఎన్నికల అధికారి హరినారాయణన్

నెల్లూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 18వ తేదీ నుంచి నామినేషన్లు స్వీకరించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం హరినారాయణన్ వెల్లడించారు. అదే రోజున అన్ని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు నోటిఫికేషన్ విడుదల చేస్తారని చెప్పారు. నెల్లూరు ఎంపీ స్థానానికి కలెక్టరేట్‌లో తాను, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆయా రిటర్నింగ్ అధికారి కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ జరుగుతుందని పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేయవచ్చని తెలిపారు. సెలవు రోజులు మినహా ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీడియా సెంటర్లో ఎన్నికల నోటిఫికేషన్ వివరాలను హరినారాయణన్ విలేకరుల సమావేశంలో వివరించారు. 26వ తేదీన నామినేషన్ల పరిశీలన, 29 వరకు ఉపసంహరణకు అవకాశం కల్పించినట్లు కలెక్టర్ చెప్పారు. అదేరోజున పోటీలో నిలిచిన అభ్యర్థుల జాబితాను ప్రచురిస్తామని పేర్కొన్నారు. మే 12వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్లు, ఎన్నికల శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని చెప్పారు. 12న సాయంత్రానికి పోలింగ్ సిబ్బందికి ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు, ఇతర సామగ్రిని అందజేసి ముందుగా నిర్ణయించిన రూట్ మ్యాప్ ప్రకారం పోలింగ్ కేంద్రాలకు వాహనాల్లో పంపనున్నట్లు వివరించారు. 13వ తేదీన పోలింగ్ జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో గతానికంటే ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేలా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ ప్రకటనలకు కచ్చితంగా ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకూ రూ.2.63 కోట్ల నగదు, మద్యం, వివిధ వస్తువులను సీజ్ చేసినట్లు వెల్లడించారు. ప్రజలెవరూ రూ.50 వేలకు మించి నగదు తీసుకెళ్లవద్దని, ఒకవేళ తప్పనిసరి అయితే ఆ నగదుకు సంబంధించిన పత్రాలను కూడా తీసుకెళ్లాలని సూచించారు. రూ.10 లక్షల్లోపు పట్టుబడిన నగదును జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీలో పరిశీలిస్తామని, రాజకీయ కోణం లేదని తేలితే తిరిగి నగదును విడుదల చేస్తామని పేర్కొన్నారు. రూ.10 లక్షలు దాటితే ఆదాయపు పన్ను శాఖ అధికారులకు అప్పగిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కే సదారావు, సమాచార శాఖ ఇంజనీర్ కిషోర్ పాల్గొన్నారు.



పోలింగ్ అధికారుల శిక్షణను పరిశీలిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

● పోలింగ్ విధులు సమర్థవంతంగా నిర్వహించండి

నెల్లూరు(హరనాథపురం) : పీఓలు, ఏపీఓలు సార్వత్రిక ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. సోమవార డీకే కళాశాల, వీఆర్ కళాశాలల్లో జరుగుతున్న శిక్షన తరగతులను ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. వీఆర్ లా కళాశాలలో పోలింగ్ అధికారులకు నిర్వహించిన పరీక్షను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రశ్నపత్రంలోని పలు ప్రశ్నలను అడిగి ఏ మేరకు శిక్షణ పొందారో పరిశీలించారు. ఈవీఎం మిషన్ వాడకంపై పోలింగ్ సిబ్బందికి ఇస్తున్న శిక్షణను కలెక్టర్ దగ్గరుండి పరిశీలించారు. పోలింగ్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ తమ విధులను నిర్వర్తించాలని, పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా తమ వంతు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు, నెల్లూరు రూరల్ రిటర్నింగ్ అధికారులు వికాస్ మర్మత్, మలోల, ఏఆర్‌ఓ జీవీ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు 20,51,578 మంది

నెల్లూరు (హరనాథపురం) : సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో ఓటు హక్కు వినియోగించుకొనే వారి లెక్క తేలింది. ఈ నెల 14వతేదీ అర్ధరాత్రి 12 గంటల వరకు ఓటరుగా నమోదు చేసుకున్నవారు, తమ ఓటు హక్కును ఎన్నికల్లో వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో 14వ తేదీ అర్ధరాత్రి వరకు చాలా మంది స్వయంగా అధికారులకు, ఆన్‌లైన్ ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేశారు. ఎట్టకేలకు ఈ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకొనే వారి వివరాలు తేల్చారు. ఈ లెక్కన జిల్లాలో 19,35,103 మం ది ఓటర్లు ఉన్నట్టు తేల్చారు. అయితే, వెంకటగిరి నియోజక వర్గంలోని మూడు మండలాలు (కలువాయి, సైదాపురం, రాపూరు) నెల్లూరు జిల్లా పరిధిలో నియోజకవర్గం తిరుపతి రిటర్నింగ్ అధికారి పరిధిలో ఉంది. వెంకటగిరి నియోజకవర్గ మండలాలు కలిపితే జిల్లాలో 20,51,578 లక్షల మంది ఓటర్లు ఉన్నారు.




నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
కందుకూరు	1,12,865	1,15,309	26	2,28,200
కావలి	1,16,636	1,20,911	28	2,37,575
ఆత్మకూరు	1,05,444	1,09,130	8	2,14,582
కోవూరు	1,28,501	1,37,747	25	2,66,273
నెల్లూరు సిటీ	1,16,037	1,21,983	67	2,38,087
నెల్లూరు రూరల్	1,35,445	1,42,958	20	2,78,423
సర్వేపల్లి	1,12,517	1,18,885	26	2,31,428
ఉదయగిరి	1,19,388	1,21,137	10	2,40,535
వెంకటగిరి (మూడు మండలాలు మాత్రమే)	56,923	59,551	1	1,16,475
మొత్తం	10,03,756	10,47,611	211	20,51,578

పగలు ప్రచారాలు.. రాత్రి బుజ్జగింపులు!

ఆత్మకూరులో రాజ'కీ'య సిత్రాలెన్నో!

వేగంగా మారుతున్న సమీకరణలు



ఆత్మకూరు ఏప్రిల్ 15 : ఆత్మకూరు నియోజకవర్గంలో ఏ వీధులు చూసినా ఎన్నికలపై చర్చే జోరుగా సాగుతోంది. పార్టీల బలాలు.. బలహీనతలు రోజుకో మలుపు తిరుగుతూ ఎంతో ఆసక్తికరంగా సాగుతున్న ఈ పోరులో నేతలు తమ సమీకరణాలను అత్యంత వేగంగా మార్చేస్తున్నారు. ఓ వైపు పగలంతా ప్రచారం చేస్తూ... రాత్రయితే అసమ్మతులను బుజ్జగించడం.. వలసలను రాబట్టడం.. వెన్నుపోట్లను పసిగట్టడం.. ఇలా జోరుగా సాగుతున్నాయి. వారి రాజకీయ అంచనాలను పరిగణలోకి తీసుకుని అన్ని ఎత్తులు.. జిమ్మిక్కులు చేస్తున్నారు.

● ఆసక్తికర పరిణామాలు

ఎందరో హేమాహేమీలు పోటీ చేసి గెలిచి మంత్రుల స్థాయికి ఎదిగిన ఆత్మకూరు నియోజకవర్గంలో ఈసారి ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. ప్రస్తుత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా ఆనం రామనారాయణరెడ్డి, వైసీపీ అభ్యర్థిగా మేకపాటి విక్రమ్‌రెడ్డి బరిలో నిలిచారు. టీడీపీ తరఫున మాజీ ఎమ్మెల్యేలు కొమ్మి లక్ష్మయ్య నాయుడు, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కంభం విజయరామిరెడ్డిలతోపాటు బొల్లినేని కృష్ణయ్య, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గూటూరు మురళీకన్నబాబు వర్గీయులు ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి విజయానికి ప్రచారం చేసిన జడ్పీ మాజీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ప్రస్తుత వైసీపీలో చేరిపోయారు. అదేక్రమంలో వైసీపీకి చెందిన ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్‌ఛైర్మన్ షేక్ సర్దార్‌తోపాటు పలువురు కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులు టీడీపీలో చేరి ఆనం విజయం కోసం ప్రచారం చేస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు జోరందుకున్నాయి. 2019 పోల్చితే 2024లో అనేక పరిణామాలు చోటు చేసుకుంటున్న తీరు ప్రజల్లో ఆసక్తిని రేపుతున్నాయి. మొన్నటి వరకు సన్నిహితంగా మెలిగిన పలు పార్టీల నేతలు ఆనం, మేకపాటి గెలుపు కోసం ఎవరికి వారు ఎత్తులకు పై ఎత్తులు వేస్తుండటం.. రాజకీయాలు ఎంతటి వారినైనా విడదీస్తుందని ప్రజల్లో చర్చ నడుస్తోంది. ఏది ఏమైనా ఆత్మకూరులో టీడీపీ, వైసీపీ మధ్య నువ్వా? నేనా!? అనే పోటీతత్వం పెరిగిందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

రాజీనామా చేసి ప్రచారంలోకి రావాల్సిందే!

వలంటీర్లపై అధికార పార్టీ నేతల ఒత్తిళ్లు

పొదలకూరులో 58 మంది రాజీనామా

పొదలకూరు, ఏప్రిల్ 15 : 'పార్టీకి మీరే పెద్ద దిక్కు. ప్రచారంలో పాల్గొంటే అధికారులు చర్యలు తీసుకోవడం ఏమిటి!?. మీరే రాజీనామా చేయండి. పార్టీ కోసం పని చేయడం. ఎన్నికల్లో గెలిచాక తిరిగి వలంటీర్లు మిమ్మల్ని తీసుకుంటాం.' అధికార పార్టీ నేతల మాటలివి. ఇది ఒకవైపు మాత్రమే రెండోవైపు ఒత్తిళ్లు, బెదిరింపులూ ఉంటున్నాయి. కచ్చితంగా రాజీనామా చేసి, ప్రచారంలోకి రావాల్సిందేనంటూ ఒత్తిడి చేస్తున్నట్లు పలువురు వలంటీర్లు ఆవేదన చెందుతున్నారు. సమావేశాలు పెట్టి మరీ సూచనప్రాయమైన హెచ్చరికలు చేస్తుండటంతో చేసేదిలేక వలంటీర్లు కూడా అయిష్టంగానే తమ విధులకు రాజీనామా చేస్తున్నారు. పొదలకూరు మండలంలో అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల తట్టుకోలేక సోమవారం ఒక్కసారిగా 58 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. మొగళ్లూరు గ్రామానికి చెందిన వలంటీర్లు 9 మంది, వావింటపర్తిలో 10 మంది, మహమ్మదాపు రంలో 17 మంది, ఆర్‌వైపా లెంలో 10 మంది, తాటిపర్తిలో 11 మంది, మరుపూరులో ఒకరు ఇలా మొత్తం 58 మంది తమ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు పేర్కొంటూ ఎంపీడీవో మహ్మద్ రఫీకి పత్రాలు అంద జేశారు.



ఎంపీడీవోకు రాజీనామా పత్రాలు ఇస్తున్న వలంటీర్లు

మద్యం నిల్వలపై దాడులు చేయండి!

- ప్రతి రోజు రూట్‌వాచ్‌లు నిర్వహించాలి
- సెబ్ జాయింట్ కమిషనర్ అరుణరావు



సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కమిషనర్ అరుణరావు

నెల్లూరు (క్రైం), ఏప్రిల్ 15 : జిల్లావ్యాప్తంగా మద్యం డంపింగ్, అధిక నిల్వలపై దాడులు నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని సెబ్ జాయింట్ కమిషనర్ బి అరుణరావు అధికారులకు ఆదేశించారు. నగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సెబ్ అధికారులతో జరిగిన ఎన్నికల సమన్వయ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగిచారు. డీపీఎల్‌కి సంబంధించిన కేసులలో ముద్దాయిలను విచారించి అధికంగా మద్యం సరుకు కొనుగోలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మండల, గ్రామ ప్రజలు, ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయ పరుచుకొని మద్యం రహిత ఎన్నికలు నిర్వహణకు కృషి చేయాలన్నారు. చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహిస్తూనే ప్రతి రోజు రూట్‌వాచ్‌లు నిర్వహించాలని సూచిచంఆరు. 2014, 2019 ఎన్నికల సమయంలో నేరాలకు పాల్పడిన ప్రాంతాలు, ముద్దాయిలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో ఏఈఎస్ జి నరసింహరావు, డీసీ హేమంతనాగరాజు, ఏఎస్పీ సౌజన్య, ఏసి పి దయాసాగర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నెల్లూరు సెబ్ 1వ స్టేషన్, మనుబోలు చెక్‌పోస్టులను తనిఖీ చేశారు.

● తమిళనాడుకు జిల్లా పోలీసులు

తమిళనాడులో ఈ నెల 19వ తేదీన జరిగే లోక్‌సభ ఎన్నికల బందోబస్తు కోసం జిల్లాకు చెందిన 350 మంది పోలీసు అధికారులు, సిబ్బందిని కేటాయించారు. సోమవారం పోలీసు కార్యాలయం నుంచి ప్రత్యేక వాహనాల్లో వారు తమిళనాడుకు వెళ్లారు.


● పట్టుబడుతున్న మద్యం, నగదు

జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి నుండి సోమవారం వరకు పోలీసులు చేపట్టిన తనిఖీలో నగదు, మద్యం భారీగా పట్టుబడింది. నగరంలోని చిన్నబజారు పోలీసు స్టేషన్ పరిధిలో రూ.9,90,071 నగదు, బాలాజీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రూ.5లక్షలు, రాపూరులో రూ.1.29 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సంతపేట పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ముగ్గుర్ని అదుపులోకి తీసుకొని రూ.900 నగదు స్వాధీనం చేసుకున్నారు. గుడ్లూరు పరిధిలో 68 మద్యం సీసాలు, వెంకటాచలంలో 12, సైదాపురంలో 14, కలిగిరిలో 6, ఎస్‌ఆర్‌పురంలో 10, కందుకూరు రూరల్ పరిధిలో 13 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. సెబ్ పోలీసులు 215 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

నీరసిస్తున్న పొలంబడి!

- నాడు ఘనం.. రానురాను శూన్యం
- నిర్వహణకు భారీగా తగ్గిన నిధుల కేటాయింపు
- అన్నదాతపై తీవ్ర ప్రభావం

ఏ రాష్ట్రంలో లేనివిధంగా రైతులకు అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నామంటూ ప్రభుత్వ పెద్దలు ప్రకటనలు గుప్పిస్తుంటారు. అయితే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే పలు పథకాల ద్వారా రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు, రైతుల కోసం నిర్వహిస్తున్న కార్యక్రమాల నిర్వహణ బడ్జెట్ నిధుల్లోనూ కోత విధిస్తోంది. ఇందుకు 'పొలంబడి' నిర్వహణే నిదర్శనం.



నెల్లూరు (వ్యవసాయం), ఏప్రిల్ 15 : వ్యవసాయంలో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానంతోపాటు పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయడం, రైతును ఒక వ్యవసాయ శాస్త్రవేత్తగా తీర్చిదిద్దడంతోపాటు ఆరోగ్యకర పంటలు సాగు చేసుకునేలా అవగాహన కల్పించడం కోసం రూపొందించబడినదే పొలంబడి కార్యక్రమం. దుక్కి దున్నడం మొదలు విత్తనాలు, ఎరువులతోపాటు పంట కోత దశకు వచ్చే వరకు దాదాపు 14 వారాలపాటు వ్యవసాయ పనుల్లో రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తారు. 30 మంది రైతులకు వ్యవసాయ పనుల్లో మెలకువలు, ఎరువుల వాడకం, పెట్టుబడి తదితర అంశాలపై అవగాహన, శిక్షణ అందిస్తారు. ఈ 30 మంది రైతులకు ఒక సమన్వయకర్తను ఏర్పాటు చేసి రెండు, మూడు ఎకరాల పొలంలో కార్యక్రమాలు నిర్వహిస్తారు. అక్కడ తెలుసుకున్న అంశాలను మిగిలిన రైతులు పాటించేలా చేస్తారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న పొలంబడి కార్యక్రమానికి బడ్జెట్ కేటాయింపుల్లో భారీగా కోత విధించారు. వందల సంఖ్యలో నిర్వహించే కార్యక్రమాలు పదుల సంఖ్యలోకి కుదించేశారు.

ఇదీ బడ్జెట్ నిధుల కేటాయింపు

ఒక్కో పొలంబడి కార్యక్రమ నిర్వహణకు రూ.20,500 రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తోంది. 2022 ఖరీఫ్‌లో రూ.27.28 లక్షలు, రబీలో రూ.73.23లక్షలు కేటాయించింది. 2023 ఖరీఫ్‌కు రూ.4.51లక్షలు, రబీలో రూ.5.74 లక్షలు మాత్రమే కేటాయించారు. 2022 ఖరీఫ్‌కు సంబంధించిన రూ.27.28 లక్షలు చెల్లించారని రబీ సీజన్‌కు సంబంధించిన నిధులు రావాల్సి ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. 2023 సీజన్‌కు సంబంధించి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు.

● కార్యక్రమం నిర్వహణ ఇలా..

'పొలంబడి'ని వారంలో రెండు రోజులు అంటే బుధ, గురువారాల్లో నిర్వహించాలి. మండల వ్యవసాయాధికారి ఒక పొలంబడి కార్యక్రమం, మరొకటి వ్యవసాయ సహాయకులు నిర్వహించాలి. జిల్లాలో రబీ సీజన్‌లో వరి, జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర, శనగలు, వేరుశనగ, మిరప, పత్తి, పొగాకు, అరటి తదితర పంటలు సాగవుతున్నాయి. ఆయా పంటలకు సంబంధించిన సమాచారం, సాగులో మెలకువలు, విత్తనాల ఎంపిక, చీడపీడల నివారణ, సస్యరక్షణ, ఎరువుల తయారీలో మెలకువలు వంటి సమాచారం అందించేందుకు ఒక్కో మండలానికి దాదాపుగా 8 పొలంబడి కార్యక్రమాలు నిర్వహించేవారు. 2022 రబీ సీజన్‌లో 357, ఖరీఫ్ సీజన్‌కు 133 పొలంబడుల లక్ష్యం కేటాయించారు. అదేవిధంగా 2023 రబీకి కేవలం 28, ఖరీఫ్‌కు 22 పొలంబడుల లక్ష్యాన్ని మాత్రమే కేటాయించారు. అంటే మండలానికి కనీసం ఒక పొలంబడి నిర్వహణకు కూడా అవకాశం లేకుండా పోయింది.

సొంత నిధులతో అభివృద్ధి పనులు చేశా!

- మర్రిపాడు ప్రజాగళంలో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

మర్రిపాడు, ఏప్రిల్ 15 : తన సొంత నిధులు, ఎంపీ నిధులతో జిల్లావ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులు చేసినట్లు ఎన్డీఏ కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారం సోమవారం రాత్రి మర్రిపాడులో జరిగిన ప్రజాగళంలో ఆత్మకూరు ఎన్డీఏ కూటమి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి వేమిరెడ్డి పాల్గొని, మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి జరగాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును సీఎం చేయాలని పిలుపునిచ్చారు. ఆనం రామనారాయణరెడ్డి మాట్లాడుతూ తమ ప్రత్యర్థులు విజయ్‌సాయిరెడ్డి, విక్రమ్‌రెడ్డిలపై విమర్శ ల వర్షం కురిపించారు. ప్రజాధనాన్ని లూటీ చేసిన వారు తన ప్రత్యర్థిగా చెప్పుకొచ్చారు. పాత తప్పులతో జైలుకు వెళ్లాడు. జైల్లో జగన్ పక్కన పడుకున్నాడు. పశ్చిమ గోదావరి జిల్లాలో మద్యానికి ఉపయోగించే చక్కెర కర్మాగారాన్ని తీసుకొని తద్వారా చీపు లిక్కర్ తయారు చేసి ప్రజల ప్రాణాలను పొట్టన పెట్టుకున్నాడు. విష పూరితమైన మద్యాన్ని అమ్మే విజయ్‌సాయి రెడ్డి కావాలో స్వచ్ఛపూరితమైన మంచినీరు ఇచ్చే వేమిరెడ్డి కావాలో కోరుకోవాలంటూ ఆనం వ్యాఖ్యానించారు. మేకపాటి విక్రమ్‌రెడ్డి కుటుంబం ఆత్మకూరును అభివృద్ధి చేయకుండా పదవులను అనుభవించి పదేళ్లు వృథా చేశారంటూ మండిపడ్డారు. దోపిడీ లక్ష్యంగా పని చేసే విక్రమ్‌రెడ్డి కావాలా? అభివృద్ధి చేసిన తాను కావాలో ప్రజలు ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కొమ్మి లక్ష్మయ్య నాయుడు, విజయరామిరెడ్డి, నాయకులు ఆనం రంగమయూర్ రెడ్డి, గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాగళంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి

కాంగ్రెస్‌కు రాజీనామా చేస్తున్నా!

- వయోభారంతోనే ఈ నిర్ణయం : సీవీ శేషారెడ్డి

నెల్లూరు (వైద్యం) ఏప్రిల్ 15 : సుదీర్ఘకాలంపాటు కాంగ్రెస్ పార్టీకి ఎనలేని సేవ చేసిన తాను వయోభారంతో ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సీవీ శేషారెడ్డి వెల్లడించారు. సోమవారం నెల్లూరులోని ఓ కల్యాణ మండపంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు. 65 ఏళ్లుగా కాంగ్రెస్ అభ్యున్నతికి ఎంతో కృషి చేసినట్లు చెప్పారు. 1959లో తొలిసారి సర్పంచ్‌గా ఎన్నికయిన తాను 1978, 1989లలో సర్వేపల్లి ఎమ్మెల్యేగా గెలిచినట్లు తెలిపారు. అప్పట్లో పార్టీ విప్‌గా కూడా పని చేశానని, ఏఐసీసీ సభ్యుడిగా, పీసీసీ సమన్వయ కమిటీలోనూ పని చేసినట్లు చెప్పారు. ప్రస్తుత ఎన్నికల తరుణంలో పల్నాడు జిల్లా పార్టీ పరిశీలకుడిగా నియమించారని చెప్పారు. అయితే వయోభారం వల్ల తాను పార్టీకి రాజీనామా చేస్తున్నానని, ఏ పార్టీలోనూ చేరనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నేత రఘురాం ముదిరాజ్, సీవీ శేషారెడ్డి తనయుడు హర్షవర్ధన్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీవీ శేషారెడ్డి

ప్రత్యేక హోదా కోసం జన చైతన్య యాత్ర

నెల్లూరు(సాంస్కృతికం) ఏప్రిల్ 15 : ఆంధ్రప్రదేశ్‌కు అటకెక్కిన ప్రత్యేక హోదా సాధన కోసం నెల్లూరు నుంచి శ్రీకాకుళం వరకు జనచైతన్య యాత్ర నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం నేత కె.వీరాంజనేయులు, అరుణోదయ సాంస్కృతిక మండలి నేత విమలక్క, అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య నాయకుడు ఎం కరీం బాషా తెలిపారు. సోమవారం జర్నలిస్టు భవన్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా దక్కలేదు కానీ 3వ దఫా ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. ప్రత్యేక హోదా స్థానంపై ప్రధాన పార్టీలు దృష్టి సారించడంలేదని విమర్శించారు. అంబేడ్కర్ 133వ జయంతి సందర్భగా ఏప్రిల్ 14న రాపూరు మండలం కండలేరు నిర్వాసిత గ్రామం తానంచర్లలో ఈ యాత్ర ప్రారంభించామని, కారల్‌మార్క్స్ 206వ జయంతి రోజున శ్రీకాకుళం జిల్లా బొడ్డపాడులో ముగిస్తామని తెలిపారు. ప్రజాస్వామ్యవాదులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కృష్ణ, సుజ్ఞానమ్మ, కె.సతీష్, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.



సకల హంగులతో

నగర వనం

- రూ.1.4 కోట్లతో నిర్మాణం
- మే నెలాఖరుకు ప్రారంభానికి సన్నాహాలు
- ప్రజలతో అటవీశాఖ అనుబంధం

విక్రగుంట, ఏప్రిల్ 15: ప్రజలతో అనుబంధం కలిగి ఉండేందుకు అటవీ శాఖ పలు పట్టణాలు, నగరాల్లో నగర వనాలను నిర్మిస్తున్నది. అన్నీ హంగులతో ఆహ్లాదకరంగా ఉండే ఈ నగరవనాలు అటు పెద్దలకు, ఇటు పిల్లలకు ఉత్సాహాన్ని ఇవ్వనున్నట్లు అటవీశాఖ అధికారులు పేర్కొంటున్నారు. దేశవ్యాప్తంగా కేంద్రప్రభుత్వం 400లకుపైగా నగరాల్లో వీటిని ఏర్పాటు చేస్తున్నది. ఇందులో భాగంగానే కావలి నియోజకవర్గానికి మంజూరైన మూడు నగరవనాల్లో ముంగమూరు జాతీయ రహదారి వద్ద ఉన్న సెంట్రల్ నర్సరీ ఒకటి. 123 ఎకరాల అటవీశాఖ భూమిలో రూ.1.4 కోట్లతో నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. వివిధ రకాల పండ్లు, కలప, పూలమొక్కలతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణంలో చిన్న పిల్లలకు పార్కు, వాకింగ్ ట్రాక్, యోగా, ఓపెన్ జిమ్ ఏర్పాటుకు పనులు జరుగుతున్నాయి.ఇది హైవే పక్కనే ఉండడంతో వాహనాలు నిలుపుకునేందుకు పార్కింగ్ ప్లేస్, సోలార్ లైట్ల ఏర్పాటు పూర్తి అయింది. స్థానికులు, ప్రయాణికులు, పర్యాటకుల కోసం హోటల్, మినరల్ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి స్థలాన్ని కూడా కేటాయించారు. తొమ్మిది రకాల వనాలు, నవగ్రహ వనం (నవగ్రహాలకు సంబంధించిన చెట్లు) ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కూడా చదును చేశారు. నగరవనానికి ప్రధానద్వారంతోపాటు ప్రసన్న వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు సేదతీరేందుకు పలు వసతులు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. అటవీ ప్రాంతం సందర్శనార్థం నగరవనంలో రోడ్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు. మే నెలాఖరులోపుగా నగరవనాన్ని పూర్తిచేసి, ప్రారంభించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు.



అగ్ని ప్రమాదాలపై అవగాహన

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 15: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా జిల్లా అగ్నిమాపక శాఖాధికారి వాకా శ్రీనివాసులురెడ్డి ఆదేశాల మేరకు నగరంలోని ప్రధాన రైల్వే స్టేషన్, ఆర్టీసీ బ స్టాండ్లలో సోమవారం ప్రజలకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రజలకు కరపత్రా లు పంపిణీ చేస్తూ అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



కరపత్రాలు పంచుతున్న అగ్నిమాపక సిబ్బంది

వాగులో వ్యాపించిన మంటలు

వరికుంటపాడు, ఏప్రిల్ 15: మండలంలోని కనియంపాడు గ్రామ శివారు పిల్లాపేరు వాగులో ఎండిన చెట్లు, గడ్డి సోమవారం అగ్నికి ఆహుతైంది. గ్రామానికి శివారున ఉన్న విస్తారమైన వాగులో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతోనే మంటలు వ్యాపించినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. రోజంతా దట్టమైన మంటలు వ్యాపించడంతో చెట్లు దగ్ధమైంది. ఈ నేపథ్యంలో దట్టమైన పొగలు కమ్ముకోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.



200 కిలోల నిషేధిత ప్లాస్టిక్ కవర్ల స్వాధీనం

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 15 : నగరంలో 200 కిలోల నిషేధిత ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం చేసుకుని పలువురు వ్యాపారులకు జరిమానా విధించినట్లు ఎంహెచ్‌వో డాక్టర్ వెంకటరమణయ్య తెలిపారు. సోమవారం నగరంలోని ఏసీ కూరగాయల మార్కెట్, ఆచారివీధి, చిన్నబజార్, పెద్దబజారులలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల విక్రయాలపై నిత్యం దాడులు జరుగుతూనే ఉంటాయన్నారు. రెండు సార్లు కంటే ఎక్కువగా కవర్లు విక్రయిస్తూ పట్టుబడిన వారి లైసెన్సులను రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రతి షాపు వద్ద విధిగా చెత్త బుట్ట ఏర్పాటు చేసుకుని వ్యర్థాలను అందులోనే వేయాలని సూచించారు. ఈ నిబంధనలు అతిక్రమించిన వ్యాపారులకు జరిమానాలు విధిస్తామన్నారు.

న్యాయాధికారులకు వీడ్కోలు

నెల్లూరు(లీగల్), ఏప్రిల్ 15: నెల్లూరు ఏసీబీ కోర్టు జడ్జిగా పనిచేస్తూ అనంతపురం బదిలీ అయిన సీ సత్యవాణికి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తూ గుడివాడ సీనియర్ సివిల్ జడ్జిగా బదిలీ అయిన డాక్టర్ బీ లక్ష్మీనారాయణకు నెల్లూరు బార్‌అసోసియేషన్ అధ్వర్యంలో న్యాయవాదులు సోమవారం ఘనంగా వీడ్కోలు పలికారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీ ఉమామహేశ్వర్‌రెడ్డిలు న్యాయాధికారుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ, బార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ ఎస్‌వీఎల్ వరప్రసాద్, తదితరులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

కావలి రూరల్, ఏప్రిల్ 15: కావలి మండలం తుమ్మలపెంట పంచాయతీ కొత్తసత్రంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై సోమవారం రాత్రి రూరల్ పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.3,600 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బుచ్చిలో జరిగిన తనిఖీల్లో రూ.3 లక్షలు..

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 15: బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన వరగాని లక్ష్మీనారాయణ ఆత్మకూరు వైపు నుంచి బుచ్చికి కారులో వస్తుండగా బుచ్చిలోని టోల్‌గేట్ వద్ద నిర్వహిస్తున్న పోలీసు తనిఖీలలో ఆధారాలు లేని రూ. 3లక్షల నగదును సోమవారం బుచ్చి సీఐ హైమారావు స్వాధీనం చేసుకున్నారు. కారును సీజ్ చేశారు. నగదును ట్రెజరీలో జమ చేసినట్టు సీఐ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	142
లేయర్ లైవ్	98
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	280
లేయర్	167

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6912
వెండి కిలో ధర	రూ. 85,700
వెండి ఒక గ్రాము	రూ. 87.70

పోలీసుల తనిఖీల్లో రూ. 1.88 లక్షలు..

అల్లూరు, ఏప్రిల్ 15 : ఎన్నికల కోడ్ నేపథ్యంలో సోమవారం పలు వాహనాలను తనిఖీలు చేయగా పోలీసులకు రూ.1,88,500 పట్టుబడ్డాయి. కావలి రూరల్ సీఐ బీ.నాగభూషణం సోమవారం అల్లూరులో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో బోగోలు మండలం పాతపాలెంకు చెందిన కోదూరు రమేష్ ఆ నగదును తీసుకొని ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తించారు. నగదు వివరాలపత్రాలను అడగ్గా పొంతనలేని సమాధానం చెప్పడంతోపాటు ఆధారాలు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. ఆయన వెంట ఎస్ఐ శ్రీనివాసులు రెడ్డి తదితరులు ఉన్నారు.

కష్టాల కడలిలో కార్మికులు

- వైసీపీ ప్రభుత్వంలో పలు సంక్షేమ పథకాల రద్దు
- కొన్నింటిని డీఆర్‌డీఏలో విలీనం
- నిర్వీర్యమైన కార్మికశాఖ
- భవన నిర్మాణ కార్మికులకు మొండిచేయి



సంగం, ఏప్రిల్ 15 : భవన నిర్మాణ రంగంపై ఆధారపడ్డ అసంఘటిత కార్మికుల సంక్షేమం కోసం టీడీపీ ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేసింది. ఆ సమయంలో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ మాటలతో గారడీ చేశారు. వాగ్దానాలతో మభ్యపెట్టారు. మన ప్రభుత్వం వస్తే కార్మికుల అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు చేపడతామని నమ్మించారు. నిజమేనేమో అని నమ్మి ఓట్లు వేసిన కార్మికులను నట్టేట ముంచారు.

● పలు పథకాల రద్దు

చంద్రబాబు ప్రభుత్వం అమలు చేసిన పలు కార్మిక సంక్షేమ పథకాలను జగన్ రద్దు చేశారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలోనే అమలు చేసే పథకాలే అసంఘటిత కార్మికులకు కూడా వర్తిస్తాయని మాయ చేశారు. ఐదేళ్ల క్రితం వివిధ పథకాల కోసం వచ్చే కార్మికులతో కళకళలాడిన కార్మికశాఖ కార్యాలయం నేడు వెలవెలబోయిం ది. జగన్ ఆడిన ఓట్లాటలో అసంఘటిత కార్మికులు ఓడిపోయారని కార్మిక సంఘాల నేతలు ఆవేదన చెందుతున్నారు. గతంలో వృత్తి పనిముట్లు ఇస్తే.. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆపేశారని తాపీ మేస్త్రీలు ఆక్రోశిస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇ-శ్రామ్ లెక్కల ప్రకారం జిల్లాలో ఐదులక్షలమందికిపైగా సంఘటిత, అసంఘటిత కార్మికులు ఉన్నారు. వీరిలో బిల్డింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్మికులు సుమారు 1.5 లక్షల మంది ఉన్నారు. వీరికి గత టీడీపీ ప్రభుత్వంలో పలు పథకాలు అమలు చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సగం పథకాలను రద్దు చేసింది. కొన్నింటిని మాత్రం కార్మిక శాఖ నుంచి తొలగించి, గ్రామీణుల కోసం డీఆర్‌డీఏ అమలు చేస్తున్న పథకాలే కార్మికులకు కూడా వర్తిస్తాయని, ప్రత్యేకంగా కార్మిక శాఖ పర్యవేక్షణలో అమలు చేయకుండా ఆపేసింది.

నైపుణ్య శిక్షణ ఏదీ..?

భవన, ఇతర రంగాల్లో పనిచేసే సంఘటిత, అసంఘటిత కార్మికులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి టీడీపీ ప్రభుత్వం ప్రోత్సాహం అందించింది. శిక్షణ కాలంలో ప్రతి రోజూ రూ. 300 స్టయిఫండ్ ఇచ్చేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక నైపుణ్య శిక్షణ ఎత్తేశారు.

పరికరాలు ఎక్కడ ?

నిర్మాణ రంగంలోని తాపీమేస్త్రీలు, ఎలక్ట్రీషియన్లు, ప్లంబర్లు అవసరమైన వృత్తి పనిముట్ల కోసం అప్పులు చేయాల్సిన ఉండేది. చంద్రబాబు వారి ఆర్థిక ఇబ్బందులు గుర్తించి నాణ్యమైన వృత్తి పనిముట్లను పంపిణీ చేశారు. ఒక్కొక్క కార్మికుడికి సగటున రూ. 25 వేల నుంచి రూ. లక్షకు పైగా ఖర్చు చేశారని కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు. అయితే సీఎంగా జగన్ బాధ్యతలు చేపట్టాక వృత్తి పనిముట్ల పంపిణీ పథకాన్ని రద్దు చేశారు. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కార్మికశాఖను నిర్వీర్యం చేసిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● డీఆర్‌డీఏ కార్యాలయానికి వెళ్లాల్సిందే..

కార్మికుల సంక్షేమ బోర్డు ద్వారా గుర్తింపుకార్డు పొందిన కార్మికులు ఎవరైనా 18 ఏళ్ల పైబడిన తమ కూతురికి పెళ్లి చేయాలంటే చంద్రన్న పెళ్లికానుక కోసం కార్మిక శాఖ అధికారులకు దరఖాస్తు చేసుకునేవారు. అలాగు ఏదైనా ప్రమాదంలో మరణించిన, గాయపడినా చంద్రన్న బీమా కోసం కార్మిక శాఖ కార్యాలయం తలుపులు తట్టేవారు. ప్రమాదంలో మరణించినా, శాశ్వత అంగవైకల్యం పొందినా రూ.5 లక్షలు ఇచ్చేవారు. సాధారణ మరణం అయితే రూ.60 వేల ఆర్థిక సాయం అందేది. గుర్తింపు కార్డు లేని కార్మికులు మరణించినా కూడా రూ. 50 వేలు వచ్చేవి. చదువుకునే పిల్లలు ఉంటే స్కాలర్‌షిప్‌లు అందచేసేవారు. ఇవే పథకాలు డీఆర్ డీఏ అమలు చేస్తుందని, అక్కడాఇక్కడా రెండు చోట్ల కార్మికులు లబ్ధి పొందే అవకాశం ఉందని వైసీపీ ప్రభుత్వం సరికొత్త వాదనకు తెర తీసింది. సంక్షేమ పథకాలకు డీఆర్‌డీఏకి దరఖాస్తు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. అంటే దాదాపు 11 సంక్షేమ పథకాలు కార్మిక శాఖ పరిధి నుంచి తీసేసి రద్దు చేసింది. కేంద్రం అమలు చేస్తున్న ఈ-శ్రమ్ తప్ప రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ఏ ఒక్క పథకం కూడా కార్మికశాఖ ప్రస్తుతం అమలు చేయడం లేదు.

న్యాయం కోసం వస్తే దుర్భాషలాడతారా?

- డీఎంహెచ్‌వోపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం
- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్ కిశోర్

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 15 : న్యాయం కోసం వస్తే బాధితుడిని డీఎంహెచ్‌వో దుర్భాషలాడడం బాధాకరమని, దీనిపై కలెక్టర్‌తో పాటు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్ కిశోర్ తెలిపారు. ఆయన తెలిపిన సమాచారం మేరకు.. కావలి పట్టణానికి చెందిన దళితుడు శ్రీనివాసులు తన భార్య అరుణశ్రీ లక్ష్మి కడుపు, తల నొప్పి, జ్వరంతో బాధపడుతుండగా స్థానిక ఓ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి వైద్యులు స్థానిక ఫోకస్ స్కానింగ్ సెంటర్‌లో ఎంఆర్ఐ స్కానింగ్ చేయించారు. అయితే తలనొప్పి తీవ్రంగా ఉండటంతో అక్కడి వైద్యులు నెల్లూరులోని డీఎస్ఆర్ ఆసుపత్రికి సిఫార్సు చేశారు. ఇక్కడ వైద్యుల సూచనల మేరకు క్లారిటీ స్కానింగ్ సెంటర్‌లో మళ్లీ ఎంఆర్ఐ స్కానింగ్ తీయించారు. అయితే కావలికి నెల్లూరు స్కానింగ్ సెంటర్‌లో రిపోర్టులకు పూర్తి విరుద్ధంగా ఫలితాలు వచ్చాయి. పూర్తిస్థాయి పరిశీలన చేస్తే అది కావలి స్కానింగ్ సెంటర్ వైఫల్యమేనని తేలింది. దీంతో కావలి స్కానింగ్ సెంటర్‌పై ఫిర్యాదు చేసేందుకు సోమవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి బాధితురాలి భర్త శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి శంకర్ కిశోర్‌తో కలసి వచ్చారు. అయితే డీఎంహెచ్‌వో పెంచలయ్య గంట తర్వాత బాధితుడు శ్రీనివాసులను లోపలికి పిలిచారు. ఈ నేపథ్యంలో ఏఐటీయూసీ కార్యదర్శి అక్కడ ఉద్యోగులతో వాగ్వివాదానికి దిగారు. స్కానింగ్ సెంటర్‌లో జరిగిన తప్పులపై ఫిర్యాదు చేస్తున్న శ్రీనివాసులను డీఎంహెచ్‌వో దుర్భాషలాడారని బాధితుడు ఆరోపించారు. ఈ సందర్భంగా శంకర్ కిశోర్ మీడియాతో మాట్లాడుతూ బాధితురాలు లక్ష్మి ప్రస్తుతం నడవలేని స్థితిలో ఉందన్నారు. రోజూ కూలి పని చేసుకునే దళిత కుటుంబానికి చెందిన శ్రీనివాసులు తన భార్య వైద్య చికిత్సల కోసం ఇప్పటికే రూ.95 వేల ఖర్చు చేశారని చెప్పారు. దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న శంకర్ కిశోర్

ప్రజలు ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు

- ఎన్నికల ముందు జగన్‌కు దాడులు గుర్తుకు వస్తాయి
- బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 15: రాష్ట్రంలో బీజేపీ, తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమి ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని, కేంద్ర, రాష్ట్రాల్లో ఎన్‌డీఏ ప్రభుత్వాలు ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి తెలిపారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్‌రెడ్డిపై జరిగిన దాడిని ప్రధాని నరేంద్రమోదీతో పాటు అందరూ ఖండించారని, అయితే ఎన్నికలు ముందే జగన్మోహన్‌రెడ్డిపై దాడులు జరుగుతాయన్నారు. 2019 ఎన్నికలకు ముందు ఇదే విధంగా కోడికత్తి దాడి జరిగిందని, ఇప్పుడు రాయితో దాడి జరిగిందన్నారు. రాయితో దాడి చేయించుకున్నందా.. చేసిందా తేల్చాల్సి ఉందని, ముఖ్యమంత్రికే భద్రత కల్పించలేని రాష్ట్ర డీజీపీని విధుల నుంచి తొలగించాలన్నారు. సానుభూతితో ఎన్నికల్లో గెలవలేరన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. ఐదేళ్లలో ప్రజలకు మంచి చేసుంటే ప్రజల దగ్గరకు వెళ్లే అర్హత ఉండేదని, ఎంతసేపు గాలిలో తిరుగుతూ నేలపై దిగకుండా, నిలబడకుండా తాడేపల్లిలో కూర్చుని కనీసం ఎమ్మెల్యేలకు, ఎంపీలకు అపాయింట్‌మెంట్ ఇవ్వని జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలను ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. పంచభూతాలలో ఏది వదలకుండా దోచుకున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి ప్రదేశ్‌గా మార్చేశారని, తులసి వనం లాంటి తిరుపతి క్షేత్రాన్ని గంజాయి వనంగా మార్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల సమయానికి ఒక్క మద్యం దుకాణం కూడా ఉండదని 2019 ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారని, అయితే రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంశీధర్‌రెడ్డి, నాయకులు మిడతల రమేష్, ఎన్ని పెంచలయ్య, నరసింహ నాయుడు, జీ విజయ్, వై రాజేష్, యశ్వంత్‌సింగ్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



వైసీపీ అవినీతిపై గోడపత్రిక ఆవిష్కరిస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలి : డీఎంహెచ్‌వో

- ఆరోగ్యంపై వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో పెంచలయ్య

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 15 : పౌష్టికాహారం ప్రాధాన్యతపై మహిళలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం నెల్లూరు, కావలి, కందుకూరు, ఆత్మకూరు డివిజన్‌ల వైద్య సిబ్బందికి ఏస్ ఎయిడ్ ఫౌండేషన్ కేర్ కమ్యూనికేషన్ ప్రోగ్రాం ద్వారా మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలోని గర్భిణులు, బాలింతలు, కౌమారదశలో ఉన్న బాలికలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. వీరికి సకాలంలో వైద్య చికిత్సలు అందించటం ద్వారా మాతా, శిశు మరణాలను అరికట్టవచ్చన్నారు. పౌష్టికాహార ప్రాధాన్యత తెలుసుకుంటే మహిళలు ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. ఆ దిశగా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ఆరోగ్యకర జీవనశైలిని కొనసాగించినట్లయితే అనేక వ్యాధులు నివారించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు నవీన్‌రెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, బాలచంద్రబాబు, శ్రీనివాసులు, ఏస్ ఎయిడ్ రాష్ట్ర బృందంలోని డాక్టర్లు వాసవి, శ్రావణి, హసన్‌కుమార్, గోపీకృష్ణ, డెమో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రజకులు టీడీపీకి అండగా ఉండాలి

- గంజాం రాఘవేంద్ర

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 15 : రాబోయే ఎన్నికల్లో రజకులు తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని టీడీపీ రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి, తెలుగునాడు రాష్ట్ర రజక ఫెడరేషన్ అధ్యక్షుడు గంజాం రాఘవేంద్ర పిలుపు నిచ్చారు. సోమవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో రజకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు టీడీపీకి ఎంతో కీలకమన్నారు. ఈ నేపథ్యంలో రజకులు టీడీపీ పటిష్టత, అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శివప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో రజకులకు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వారి అభ్యున్నతికి కృషి చేసిన టీడీపీకి వారధిగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు పార్లమెంట్ టీడీపీ బీసీసెల్ కార్యదర్శి గంధం అంకయ్య, కోవూరు నియోజకవర్గ రజక సాధికార సభ్యులు తమ్మల ప్రసాద్, కావలి నియోజకవర్గం బీసీసెల్ ప్రధాన కార్యదర్శి వేలూరు శివకుమార్, ఉదయగిరి నియోజకవర్గం నేత పోతురాజు, జనసేన సభ్యులు తుమ్మల ప్రసాద్, కృష్ణయ్య, సుబ్బారావ్, ఆత్మకూరు వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



రజక నాయకులతో రాఘవేంద్ర, డాక్టర్ శివప్రసాద్

నేటి నుంచి కోదండరాముడి బ్రహ్మోత్సవాలు



బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 15: భక్తుల కోర్కెలు తీర్చే కల్పతరువుగా పూజలందుకుంటున్న బుచ్చిరెడ్డిపాళెంలోని కోదండరామ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు మండలంతోపాటు చుట్టుపక్కల మండలాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. ఇప్పటికే రాజగోపురం గర్భగుడితోపాటు పలు దేవతామూర్తుల ఆలయాలు నూతన హంగులు, విద్యుద్దీపాలతో ముస్తాబయ్యాయి. బ్రహ్మోత్సవాలు మంగళవారం అంకురార్పణతో మొదలవుతాయి. బుధవారం ఉదయం ధ్వజారోహణ, 21వతేదీ ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడసేవ, 22 రాత్రి కల్యాణోత్సవం, గజవాహన సేవ, 23 ఉదయం రథోత్సవం, సాయంత్రం తెప్పోత్సవం, 24 అశ్వవాహన సేవ, 25 ఉదయం తిరిచ్చి ఉత్సవం, అలకలతోపు, చక్రస్నానం (తీర్థవాది), రాత్రి ధ్వజ అవరోహణ జరగనున్నాయి. 26వ తేదీన ఏకాంతసేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాల్లో భాగంగా సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులకు తాగునీరు, ప్రత్యేక వసతులకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి తెలిపారు.

పరిశోధనలు రైతులకు ఉపయోగపడాలి

- సలహా మండలి సమావేశంలో శాస్త్రవేత్తలు

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 15 : వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పరిశోధనలు జరగాలని, ఆ పరిశోధనలు రైతులకు ఉపయోగపడాలని పలువురు శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. సోమవారం ఆచార్య ఎన్‌జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా నెల్లూరు వ్యవసాయ పరిశోధనా స్థానంలో దక్షిణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీ.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ సంచాలకులు డాక్టర్ ఎల్ ప్రశాంతి, విస్తరణ సంచాలకులు డాక్టర్ కేఎస్ఎస్.నాయక్, పాలకవర్గ సభ్యులు డాక్టర్ డీ కోదండరామిరెడ్డి, దక్షిణ మండల వ్యవసాయ సహ సంచాలకులు డాక్టర్ సీ రమణతోపాటు నెల్లూరు, తిరుపతి, కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలకు చెందిన పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. పంటల సాగులో చేపట్టాల్సిన మెలకువలను తెలియజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ డాక్టర్ ప్రశాంతి

ఇంటర్‌లో బీసీ కళాశాల హాస్టల్ బాలికల ప్రతిభ

నెల్లూరు(వీఆర్సీ), ఏప్రిల్ 15 : జిల్లాలోని బీసీ కళాశాల వసతి గృహం బాలికలు సీనియర్ ఇంటర్‌లో తమ సత్తా చాటి 900కు పైగా మార్కులను సాధించారని జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి వై వెంకటయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరు అర్బన్ కళాశాల వసతిగృహ విద్యార్థిని కే సింధుప్రియ (వొకేషనల్) 959, వీ రూప (925), వీ ఇందుమతి (919), ఎం కీర్తన (917), ఆత్మకూరు వసతిగృహ విద్యార్థిని బీ శిరీష (923) మార్కులు సాధించారని తెలిపారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఐదుగురు విద్యార్థులు 460 మార్కులకు పైగా సాధించారని తెలిపారు.

ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీకి

24లోగా ఫీజు చెల్లించాలి

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 15: ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ, రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్‌తోపాటు ఇంప్రూవ్‌మెంట్‌కు ఇంటర్‌బోర్డు ఇచ్చన నోటిఫికేషన్ ప్రకారం ఈనెల 18 నుంచి 24వ తేదీ లోపల ఫీజులు చెల్లించాలని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి డాక్టర్ ఆదూరు శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది మార్చిలో జరిగిన ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్, లేదా తక్కువ మార్కులు వచ్చి ఇంప్రూమెంట్ రాయదలచుకున్న విద్యార్థులతో పాటు ఈ ఏడాది విద్యార్థులు కూడా సంబంధిత కళాశాలల్లో పరీక్ష ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ప్రథమ సంవత్సరంలో కొన్ని సబ్జెక్టులలో ఫెయిల్ అయిన విద్యార్థులు పాస్ అయిన సబ్జెక్టులలో కూడా ఇంప్రూమెంట్ రాసుకోవచ్చన్నారు. వీరికి పాత మార్కులు రద్దు చేసి కొత్త మార్కులు ఇస్తారని పేర్కొన్నారు. అదేవిధంగా రెండేళ్ల ఇంటర్ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కూడా ఆ తరువాత రెండేళ్లలో రెండుసార్లు ప్రథమ, ద్వితీయ సంవత్సరాల సబ్జెక్టులలో ప్రాక్టికల్స్‌తో సహా ఇంప్రూమెంట్ రాసుకోవచ్చని పేర్కొన్నారు. వీరికి పాత లేదా కొత్త మార్కులలో ఏది ఎక్కువగా ఉంటే వాటిని పరిగణిస్తారని తెలిపారు. దీనికోసం ఆర్ట్స్ విద్యార్థులు రూ.1240, సైన్స్ విద్యార్థులు రూ.1440 ఫీజు చెల్లించాలని తెలిపారు. జవాబు పత్రాలను సరిచూసుకునేందుకు రీ వెరిఫికేషన్, రీకౌంటింగ్ సదుపాయం ఉందని, ప్రతి పేపర్ రీకౌంటింగ్‌కు రూ.260, రీ వెరిఫికేషన్‌కు రూ.1300 ఈనెల 24వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు.


● పరీక్షల షెడ్యూల్ ఇదే..

ఇంటర్‌బోర్డు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల షెడ్యూల్ ప్రకారం మే 1 నుంచి 4వ తేదీ వరకు ప్రాక్టికల్స్, 6న నైతిక, మానవీయ విలువల పరీక్ష, 7న పర్యావరణ విద్య పరీక్ష, 24 నుంచి జూన్ 1వతేదీ వరకు థియరీ పరీక్షలు నిర్వహిస్తామని ఆర్ఐవో తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలు ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ జ్ఞానభూమి పోర్టల్ నుంచి విద్యార్థుల మార్కుల జాబితాలను డౌన్‌లోడ్ చేసుకుని ఫీజు, పరీక్షల సమాచారాన్ని విద్యార్థులకు తెలియచేయాలని పేర్కొన్నారు.

కావలి

కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

ప్రజా సేవకుడు కాకర్ల విజయానికి కృషి !



వైసీపీ నాయకులకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కాకర్ల సురేష్



టీడీపీలో చేరిన వారితో కాకర్ల సురేష్

- ఆదిమూర్తిపురం గ్రామస్థుల ఉద్ఘాటన
- వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా చేరికలు
- పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన కాకర్ల సురేష్

కొండాపురం, ఏప్రిల్ 15: ప్రజాసేవకుడు కాకర్ల సురేష్ విజయం కోసం తమవంతు కృషి చేస్తామని మండలంలోని గానుగపెంట పంచాయతీలోని ఆదిమూర్తిపురం గ్రామానికి టీడీపీలో చేరిన వైసీపీ, నాయకులు, పలు కుటుంబాలు ఖచ్చితత్వంతో తెలిపారు. సోమవారం వారు గ్రామానికి చెందిన ఉదయగిరి నియోజకవర్గ రైతు కార్యదర్శి నర్రా చెంచునాయుడు చొరవతో మండల టీడీపీ కన్వీనర్ ఎమ్.ఓంకారం ఆధ్వర్యంలో కాకర్ల సురేష్ సమక్షంలో నెల్లూరులోని కాకర్ల స్వగృహంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలోకి చేరిన వారందరికీ కాకర్ల టీడీపీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పంచాయతీలోని 9వ వార్డు మెంబరు బిల్లా చినఅంకమ్మ భర్త హజరత్‌నాయుడు, పర్రె మాధవ, తులిబెల్లి రాయుడు, బెజవాడ ఆదాము, మనోజ్, జీ.మాల్యాద్రి యాదవ్‌తోపాటు వైసీపీకి చెందిన 15 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. ఇటీవల హైదరాబాదులో జరిగిన ఆత్మీయ సమావేశంలో గొట్టిగుండాలపాలెం గ్రామానికి చెందిన 50వైసీపీ కుటుంబాలు పార్టీలోకి చేరాయి. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడారు. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యారవ క్రిష్ణయ్య, పోలినేని రమేష్, సీహెచ్.వెంకటాద్రి, మాదవరపు కొండలరావు, కొమ్మి మాల్యాద్రి, మంచాల శ్రావణ్‌కుమార్, గ్రామ పెద్దలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలం కోవూరుపల్లి పంచాయతీ అంబేడ్కర్‌నగర్‌లోని వివిధ పార్టీలకు చెందిన కాలనీవాసులు సోమవారం టీడీపీలో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరావు అధ్యక్షతన స్థానికులు నిండిగుంట ప్రభాకర్, అమ్ముల సాల్మన్, దావీదుల ఆధ్వర్యంలో కావలి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి సమక్షంలో వారు పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు స్థానిక సమస్యలను క్రిష్ణారెడ్డి దృష్టికి తీకురాగా, ఆయన స్పందిస్తూ తాను గెలిచి గ్రామాన్ని దత్తత తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నేత సిద్దు, సీనియర్ నేత ఎస్.శీనయ్య, భాస్కర్, తిరుపతి, రామోహన్‌రెడ్డి, ఎన్.రంగయ్య బీ.ఆనంద్ తదితరులు ఉన్నారు.

● **అల్లూరులో...**

అల్లూరు : వైసీపీ పాలనలో రాష్ట్రం అప్పులపాలయిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. అల్లూరు మండలం నార్తుమోపూరు టీడీపీ నాయకులు నెల్లూరు నిరంజన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన చేరికల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం 150 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. నార్తుమోపూరు నుంచి చేజర్ల వెంకటేశ్వర్లు, నార్తుఆములూరు నుంచి చల్లా ఇంద్రసేనలు పార్టీలో చేరారు. ఇంద్రసేన ఆధ్వర్యంలో 25 కుటుంబాల నుంచి 50 మంది పార్టీలో చేరగా వీరికి కావ్య కృష్ణారెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సోదరుడు కోటారెడ్డిలు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు బీద గిరిధర్, రేబాల శంకర్‌రెడ్డి, బండి అమర్‌రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, నీలపరెడ్డి హరీశ్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీగా చేరికలు

● **టీడీపీకి గోకరాజుపాలెంవాసుల మద్దతు**

కందుకూరు : పట్టణంలోని గోకరాజుపాలెంవాసులు టీడీపీ కూటమికి మద్దతు ప్రకటించారు. మాజీ కౌన్సిలర్ దండే శ్రీను, న్యాయవాది ఫణిభాస్కర్ ఆధ్వర్యంలో కందుకూరు టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావును సోమవారం రాత్రి తమ పాలెంకు ఆహ్వానించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారికి ఇంటూరి టీడీపీ, జనసేన కండువాలు కప్పి కూటమిలోకి స్వాగతించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాయపాటి అరుణ, దామా మల్లేశ్వరరావు, బీజేపీ నాయకులు జొన్నాదుల రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

● **టీడీపీ అధికారంలోకి రావడం తథ్యం**



బొమ్మవరం ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నేతలు

అనంతసాగరం : టీడీపీ అధికారంలోకి రావడం తథ్యమని టీడీపీ మండలాధ్యక్షురాలు మునగపాటి సునీత తెలిపారు. మాజీ ఎంపీపీ ఎం.సుబ్బరాజు ఆధ్వర్యంలో బొమ్మవరం, కేడీపల్లి, వెంగమ్మనాయుడుపల్లి గ్రామాల్లో సోమవారం ప్రచారం నిర్వహించారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వీపీఆర్, ఆత్మకూరు అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిని గెలిపించాలనని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో నాయకులు గూడూరు శ్రీకాంత్‌రెడ్డి, పుత్తూరు చిట్టిబాబు, నవీన్, దిలీప్ పాల్గొన్నారు.



అల్లూరు : నార్తుమోపూరులో వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వెంకటేశ్వర్లు తదితరులు



బిట్రగుంట : టీడీపీలో చేరిన అంబేడ్కర్‌నగర్ వాసులు



కందుకూరు : గోకరాజుపాలెంలో జరిగిన సమావేశంలో ఇంటూరి

టీడీపీ పాలనలోనే మహిళల ఆర్థిక అభివృద్ధి

బిట్రగుంట, ఏప్రిల్ 15: టీడీపీ పాలనలోనే మహిళలు విద్య, ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి చెందారని టీడీపీ నాయకుడు పమిడి రవికుమార్ సతీమణి పమిడి ఉమాప్రియ అన్నారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేట, ఇబ్రహీంపేటల్లో సోమవారం ఆమె ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు దొడ్ల రమణమ్మ, ఎస్.పద్మ, నాయకులు పమిడి రవికుమార్‌చౌదరి, ఎల్.సుదీర్‌బాబు, డీ.అంజయ్య యాదవ్, ఏ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● **కావలి వార్డుల్లో కావ్య ప్రచారం**

కావలి : ఎమ్మెల్యేగా తనకు ఒక్క అవకాశ ఇస్తే మీ ప్రాంత సమస్యలన్నీ సత్వరం పరిష్కారిస్తానని కావలి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణ ంలోని 20,21,24 వార్డుల పరిధి శాంతినగర్, కచేరిమిట్ట తదితర ప్రాంతాల్లో సోమవారం ఆయన ప్రచారం చేపట్టారు. టీడీపీ అమలు చేయనున్న పథకాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకోవాలనే ఎమ్మెల్యేగా తనను, నెల్లూరుఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, జ్యోతిబాబూరావు, బీజేపీ నేతలు కే బ్రహ్మానందం, మందా కిరణ్, జనసేన నేత పొబ్బా సాయి విఠల్ తదితరులు పాల్గొన్నారు.

● **దగదర్తిలో మాలేపాటి ప్రచారం**

బిట్రగుంట (దగదర్తి) : టీడీపీ సీనియర్ నేత మాలేపాటి రవీంద్రనాయుడు సోమవారం దగదర్తి మండలం తురిమెర్ల, అరుంధతీవాడ, దక్షిణ మిట్ట అరుంధతీవాడల్లో ప్రచారం నిర్వహించారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అభ్యర్థి దగుమాటి క్రిష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో దగదర్తి మండల పలువురు పార్టీ నాయకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



ఉలవపాడు : ఇంటింటి ప్రచారంలో టీడీపీ శ్రేణులు

● **టీడీపీ నేతల ఇంటింటి ప్రచారం**

ఉలవపాడు : సీఎం జగన్‌ను, వైసీపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని టీడీపీ శ్రేణులు సోమవారం ఇంటింటి ప్రచారం చేపట్టాయి. ఉలవపాడులోని ఒరిగిచేను ఎస్టీ సంఘంలో మండల పార్టీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు ఆధ్వర్యంలో మహిళలు, యువకులు ప్రచారంలో పాల్గొన్నారు. కందుకూరు టీడీపీ కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 15: స్థానిక జెస్తకాలనీకి చెందిన సోమనబోయిన రవి సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు అందజేశారు.

ఎన్నికల విధులపై శిక్షణ

ఉదయగిరి, ఏప్రిల్ 15: స్థానిక ఎంజీఆర్ వ్యవసాయ కళాశాలలో సోమవారం పీవో, ఏపీవోలకు ఎన్నికల విధులపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ మాట్లాడారు. పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో విధులు నిర్వహించే ప్రతిఒక్కరూ నిబంధనలకు కట్టుబడి ఉండాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరుగకుండా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి నెహ్రూబాబు ఉన్నారు.

మే 5 నుంచి ఇంటి వద్ద ఓటు

ఉదయగిరి, ఏప్రిల్ 15: మే 5వ తేదీ నుంచి ఇంటి నుంచే అర్హత ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించామని నియోజకవర్గ ఎన్నికల అధికారి రాజారమేష్ ప్రేమ్ కుమార్ సోమవారం తెలిపారు. 85 ఏళ్లపై బడిన వృద్ధులు, 40శాతం వికలాంగులకు అవకాశం కల్పించిందన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఓటుహక్కు కల్పిస్తామన్నారు.

చప్పర వాహనంపై సంగమేశ్వరుడి గ్రామోత్సవం

సంగం, ఏప్రిల్ 15: సంగమేశ్వరాలయంలో ఆదివారం అర్ధరాత్రి సంగమేశ్వరుడు చప్పర వాహనంపై ముందుకు సాగారు. అంతకు ముందు శ్రీకామాక్షిదేవి, సంగమేశ్వర స్వామి ప్రత్యే కంగా అలంకరణ చేపట్టి పూజలు చేశారు. స్వామివారి గ్రామోత్సవానికి భక్తులు కర్పూరహారతులతో స్వాగతం పలికారు.

భగవద్గీతపై ప్రచారం

ఏఎస్ పేట, ఏప్రిల్ 15: త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక పొదలకూరు కమిటీ సభ్యులు సోమవారం అనుమసముద్రం, తెల్లపాడు, గండువారిపల్లి గ్రామాల్లో ఉగాది పండుగ విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పెంచల నరసయ్య, జి.సరోజనమ్మ, బి.కిష్టయ్య, ఎం.కొండయ్య, పి.మధ పాల్గొన్నారు.

కొప్పుల రాజుకు సన్మానం

వింజమూరు, ఏప్రిల్ 15: సంస్కరణల సృష్టికర్త విశ్రాంత కలెక్టర్ కొప్పుల రాజు అని విశ్రాంత డీఎం హెచ్‌వో డాక్టర్ మాసిలామణి అన్నారు. ఎన్నికల ప్రచారా నికి వచ్చిన కేఎస్ రాజు మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా మాసిలామణి కేఎస్ రాజుని ఆత్మీయంగా పలకరించి సన్మానం చేశారు.

ఎన్నికల ప్రచారంలో అంగన్‌వాడీ ఆయా



నెల్లూరు, ఏప్రిల్ 15: ఉదయగిరిలో సోమవారం రాత్రి ఇందిరానగర్, ఎస్సీ కాలనీల్లో నియోజకవర్గ వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గెలిపించాలని తన యుడు మేకపాటి అభినవ్‌రెడ్డి, కోడలు నిహారికరెడ్డిలు నాయకులతో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక ఇందిరానగర్ కాలనీలోని అంగన్‌వాడీ సహాయకురాలు జీ.భారతి పాల్గొన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఆమె పాల్గొనడం చర్చనీయాంశంగా మారింది.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం



మాట్లాడుతున్న చెంచలబాబుయాదవ్

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 15: ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వనాశమైన రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఈ మారు జరిగే ఎన్నికల్లో టీడీపీ గెలిచి నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే అది సాధ్యమవుతుందని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ అన్నారు. సోమవారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో పోలింగ్ కేంద్రాల ఇన్‌చార్జీలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు విసిగి వేసారిపోయారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా, వైసీపీకి తగిన గుణపాఠం చెబుదామా అని ఎదురుచూస్తున్నట్లు చెప్పారు. ఎన్నికల అనంతరం వైసీపీ శాశ్వతంగా ఇంటికెళ్లడం తథ్యమన్నారు. ప్రజలను ఓటు అడిగే నైతికహక్కు టీడీపీకే ఉందన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాల ఇన్‌చార్జిలు గడపగడపకు వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టీడీపీ అధికారంలోకి వస్తే అమలు చేసే సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఎన్నికలకు సమయం తక్కువగా ఉన్నందున ప్రతి కార్యకర్త ఓ సైనికుడిలా పని చేసి ఉదయగిరి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల సురేష్, నెల్లూరు పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు చేజర్ల వెంకటేశ్వర్లరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ సీహెచ్ బయ్యన్న, నాయకులు కాకర్ల సునీల్, కాకర్ల వెంకట్, రియాజ్, బొజ్జా నరసింహులు ఉన్నారు.

ఏఎస్ పేట: చౌటభీమవరంలో టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిగిరి సూపర్‌సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డిలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పొనుగోడు సర్పంచ్ పద్మయ్య నాయుడు, నాయకులు కుండా రమణారెడ్డి, దామెర అనిల్, చింతల బోయిన మాల్యాద్రి, పోలవరపు వెంకటరత్నం పాల్గొన్నారు.

సీతారామపురం: తెలుగుదేశం మండల కన్వీనర్ కప్ప ప్రభకర్ రాజు, మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ వెంగళశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సోమవారం రొంపిదొడ్ల గ్రామంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వీరి వెంట టీడీపీ యువత, నాయకులు ఇంటింటికీ వెళ్లి పార్టీ సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్లు, కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర భవిష్యత్ కోసం చంద్రబాబు నాయుడిని సీఎంగా చేసుకోవాలన్నారు. అందుకు నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యేగా కాకర్ల సురేష్‌ను గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కలవెల్ల జ్యోతి, ఉదయగిరి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బోగినేని కాశిరావు, ఎస్సీ సెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జాషువా, కల్లూరి వెంకటేశ్వర్లు, ఇజ్రాయిల్ నల్లి రమణయ్య తూరక వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సజావుగా ఎన్నికలు జరిగేలా చూడాలి

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 15: సీతారామపురం మండలంలోని చిన్నాగంపల్లి, సీతారామపురం, సింగారెడ్డిపల్లి, బసినేనిపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సజావుగా ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ టీడీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు సందిరెడ్డి రామారావు సోమవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో పేద, మధ్యతరగతి ఓటర్లు అధికంగా ఉన్నారని, వారు ఓటు వేయకుండా అడ్డుకుని అల్లర్లు సృష్టించి రిగ్గింగ్ చేసే అవకాశాలున్నాయని తెలిపారు. కావున పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేసి ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 15: అటవీ ప్రాంతంలో జరిగే అగ్నిప్రమాదాలపై సోమవారం డిప్యూటీ రేంజ్ అధికారి శ్రీనివాసులు దాసరిపల్లి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఉదయగిరి రేంజ్ అధికారి ఉమామహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అడవికి నిప్పంటించడం మానవాళికి పెనుముపప అన్నారు. ప్లాస్టిక్ వస్తువులను అటవీ ప్రాంతాల్లో పడవేయడంతో వాతావరణ కాలుష్యానికి పెనుముప్పుగా మారుతుందన్నారు. అడవులకు నిప్పు పెట్టడం వల్ల వృక్ష సంపదతోపాటు వన్యప్రాణులు నశిస్తాయన్నారు. ప్రజలు అవగాహన కలిగి ఉండి సహకరించాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరిగినా తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఏబీవోలు బీ.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మన్నేటికి ఘన సన్మానం



ఉదయగిరిలో మన్నేటిని సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 15: గంగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఏఎంసీ చైర్మన్, మన ఫౌండేషన్ అధి నేత మన్నేటి వెంకటరెడ్డిని టీడీపీ అధి ష్టానం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియ మించడంపై సోమవారం పలువురు ఆయన్ను గజమాలతో సన్మానించారు. గంగిరెడ్డిపల్లిలోని ఆయన నివాసానికి టీడీపీ, జనసేన నాయకులతోపాటు మన్నేటి అభిమానులు, శ్రేయోభిలాషులు చేరుకొని అభినందనలు తెలిపారు. పార్టీ అధిష్ఠానం తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

మీరే టూరిస్ట్ పొలిటీషియన్లు !

● ఎన్నికల ప్రచారంలో ఆనం రంగమయూర్ రెడ్డి



సంగంలో ఆనం రంగమయూర్‌రెడ్డి ఇంటింటా ప్రచారం

సంగం, ఏప్రిల్ 15: నెల్లూరు, ఆత్మకూరు, వెంకటగిరి, రాపూరు నియోజకవర్గాల్లో పోటీ చేసిన ఆనం కుటుంబంను అధికార పార్టీ నాయకులు టూరిస్ట్ పొలిటీషియన్లు అనడం విచారకరం అని ఆత్మకూరు టీడీపీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి అన్న కుమారుడు రంగమయూర్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన సంగంలో ఆనం రామనారాయణరెడ్డి తరఫున ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మొదట ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు చేసి ప్రచారాన్ని ప్రారంభించారు. స్వంత నియోజకవర్గమని చెప్పుకుంటూ నాలుగుసార్లు ఆత్మకూరు ప్రాంత ప్రజలతో ఓటు వేయించుకుని ఏమి అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో కాంట్రాక్టు పనులు చేసుకునే మీరు ఆనం కుటుంబంను టూరిస్ట్ పొలిటీషియన్లు అని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఎవరు టూరిస్ట్ పొలిటీషన్‌నో ఆత్మకూరు ప్రజలకు తెలుసునని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేరు ఎత్తకుండా ఆయన్ను పరోక్షంగా విమర్శించారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీలో భాగంగా సూపర్ సిక్స్ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు యాదవ్, టీడీపీ నాయకులు కర్నాటి రవీంద్రరెడ్డి, కోటు కరుణాకర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, వాసుదేవరెడ్డి, షేక్ బాబు, మంజులనాయుడు ఉన్నారు.

10 మద్యం సీసాల పట్టివేత

సీతారామపురం, ఏప్రిల్ 15: బోడసిద్దాయ్యపల్లి గ్రా మానికి చెందిన జలసూత్రం వెంకటేశ్వర్లు సోమవారం అక్ర మంగా మద్యాన్ని విక్రయించేందుకు తీసుకెళ్తుండగా మారం రెడ్డిపల్లిక్రాస్ రోడ్డు వద్ద వారి ఆటోను పోలీసులు తని ఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనంలో 10మద్యం బాటిళ్ల గుర్తించినట్లు ఎస్ఐ పత్తిపాటి అనూష తెలిపారు. బెల్టు షాపు నిర్వాహకుడు జలసూత్రం వెంకటేశ్వర్లుడిని అదుపు లోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. అక్రమంగా మద్యం తరలించిన, విక్రయించినా వారిపై కేసులు నమో దు చేస్తామని హెచ్చరించారు.

నాటిక పోటీలకు వివరాలు పంపండి

లింగసముద్రం, ఏప్రిల్ 15 : ప్రముఖ రంగస్థల నటుడు స్వర్గీయ ఎం. రాఘవేంద్రరావు స్మారకార్థం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మే 30, 31, జూన్ 1,2 తేదీల్లో నాటిక పోటీలు నిర్వహించనున్నట్లు పెదపవని గ్రామానికి చెందిన పావని ఆర్ట్స్ అధ్యక్షుడు ఎం నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు ఈ నెల 30వతేదీలోగా నటీనటులతోపాటు సాంకేతిక వివరాలు పంపాలని ఆయన తెలిపారు. మండలంలోని పెదపవనిలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన నాటికలకు రూ.50వేలు, రూ.40 వేలు, రూ.30వేల నగదు బహుమతులు, షీల్డులు అందచేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఉత్తమ నటీనటులకు, సాంకేతిక నిపుణులకు కూడా వీటిని అందచేస్తామని తెలిపారు. నటీనటులకు వసతి, భోజన సదుపాయం కల్పిస్తామని వివరించారు.

ఇంటి నుంచి ఓటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలి

కందుకూరు, ఏప్రిల్ 15 : ఇంటి నుంచి ఓటు వేసే సౌకర్యం గురించి అవగాహన కలిగి ఉండాలని సబ్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. తన కార్యాలయంలో బీఎల్‌వోలు, సెక్టార్ అధికారులతో సోమవారం సమావేశం అయ్యారు. నియోజకవర్గంలోని బీఎల్‌వోలు 18, 19, 20 తేదీల్లో 12డీ ఫారంలను తహసీల్దార్, సెక్టార్ అధికారుల పర్యవేక్షణలో తీసుకోవాలన్నారు. హోమ్ ఓటింగ్ రెండు విడతల వారీగా జరుగుతుందన్నారు. మొదటి విడత మే 3,4,5 తేదీల్లోనూ, రెండోవిడత 8,9,10 తేదీల్లో పొలిటికల్ పార్టీ ఏజెంట్స్ సమక్షంలో జరుగుతుందన్నారు. దివ్యాంగులకు పోలింగ్ స్టేషన్‌లో వలంటీర్‌తో వీల్ చైర్ సౌకర్యం కల్పిస్తామన్నారు.

● **ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి**

ఉలవపాడు : పోలింగ్ బూత్‌ల దగ్గర ఓటర్లకు అవసరమైన అన్నీ సౌకర్యాలు కల్పించి ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి ఆదేశించారు. సోమవారం ఉలవపాడులోని మహిళా సంక్షేమ భవనంలో సెక్టార్ ఆఫీసర్స్, బీఎల్‌వోలు, వీఆర్వోలకు ఎన్నికల నియమావళిపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ హోమ్ ఓటింగ్, పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాలు తదితరాలపై సమీక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రారెడ్డి, బీఎల్‌వోలు, వీఆర్వోలు, సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు అభినందనలు

కావలిటౌన్, ఏప్రిల్15: ఇంటర్‌లో ప్రతిభ చాటిన జేబీ కళాశాల విద్యార్థులకు సోమవారం అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ సన్ని అధ్యక్షతన కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విశ్వోదయా రెక్టార్ దొడ్ల వినయ్‌కుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వంశీమోహన్‌లు పాల్గొని విద్యార్థులను పుష్పగుచ్ఛాలతో అభినందించారు. ఇంటర్‌లో ప్రతిభ చాటిన బీ సుష్మ, మణితేజలను వారు సత్కరించారు.

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కావలి రూరల్, ఏప్రిల్15: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక కేంద్ర అధికారి జీ రామసిద్ధార్థ పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్లలో సోమవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అవగాహనతో ఉండాలన్నారు. ప్రత్యేకించి వేసవిలో గడ్డివాములను పరిరక్షించాలన్నారు. నివాసాలు, దుకాణాల్లో గ్యాస్ సిలిండర్ల వాడకంపై అవగాహన కల్పించారు. ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే 101, 08626-243101, 9963734286 నెంబర్లుకు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్పందన అపురూపం : పసుపులేటి సుగుణమ్మ



పసుపులేటి సుధాకర్‌కి మద్దతు తెలుపుతున్న వైసీపీ నేతలు వెంగళ్‌రెడ్డి తదితరులు

కావలిటౌన్, ఏప్రిల్ 15: ప్రచారంలో ఎక్కడికి వెళ్లినా లభించే ప్రజా స్పందన అపురూపమని పసుపులేటి సుధాకర్ సతీమణి సుగుణమ్మ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 5వ వార్డులో ఆమె పర్యటించారు. ఆమె మాట్లాడుతూ తన భర్త సుధాకర్ జన్మభూమి అభివృద్ధి, ప్రజా సంక్షేమం కోసం తపించే వ్యక్తి అని పేర్కొన్నారు. అందులో భాగంగానే పీఎస్సార్ ట్రస్ట్ స్థాపించి సొంతనిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు, పేదల విద్య, వైద్యానికి తనవంతు చేయూతనందిస్తున్నానన్నారు. తమకు లభిస్తున్న ప్రజాస్పందనకు ప్రధాన పార్టీల నేతలు జెంబేలెత్తుతున్నారని అన్నారు.

● **పసుపులేటి గూటికి వైసీపీ నేతలు**

మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్ రెడ్డి అనుచరులు, వైసీపీ నాయకులు పంగా వెంగళ్‌రెడ్డి తదితరులు సోమవారం పసుపులేటి గూటికి చేరారు. పట్టణంలోని పీఎస్సార్ కార్యాలయంలో ఆయనతోపాటు హనీఫ్ తదితరులకు పసుపులేటి సుధాకర్ పీఎస్సార్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. పసుపులేటి మాట్లాడుతూ తాను చేస్తున్న సేవా కార్యక్రమాలను మెచ్చిన ప్రజలు తమకు మద్దతు తెలపడమేకాక, తనతో కలిసి నడిచేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు.

అన్నప్రసాద వితరణ భవనం ప్రారంభం



అన్నదాన వితరణ భవన ప్రారంభోత్సంలో మహీధర్‌రెడ్డి తదితరులు

కందుకూరు, ఏప్రిల్ 15 : కనిగిరి రోడ్డులోని అయ్యప్ప స్వామి ఆలయం వెనుక నిర్మించిన అన్నప్రసాద వతరణ భవనం, మినీ కల్యాణ మండపాలను సోమవారం అర్చకులు శాస్త్రోక్తంగా ప్రారంభించారు. స్థలదాత మందలపు వెంకటేశ్వర్లు రిబ్బన్ కత్తిరించి ప్రారంభోత్సవం చేశారు. ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివి శివరాం, ఇంటూరి రాజేష్‌లు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సంఘం సభ్యులు కేఎస్ వెంకటేశ్వర్లు, ఇస్కాల వెంకటనరసంహం, నల్లబోతుల మురళి, మాదాల వెంకటేశ్వర్లు, కాటా చెంచురామయ్య, దాసరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

● **రూ.1,00,116 విరాళం**

అయ్యప్ప అన్నప్రసాద వితరణ భవనానికి స్థానిక వ్యాపారి గడిపినేని వెంకట్రావు ఆయన ధర్మపత్ని శ్రీదేవి రూ. 1,00,116 విరాళం అందించారు. అలాగే అంకమ్మ ఆలయంలో అనివేటి మండప నిర్మాణానికి సోమవారం కొత్త శ్రీనివాసులు ఆయన ధర్మపత్ని సునీతలు రూ. 10,001 విరాళాన్ని కమిటి సభ్యులు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డికి అందచేశారు.

కాపులకు ప్రాధాన్యమిచ్చింది టీడీపీయే..!



ఐక్యతను చాటుతున్న కూటమిలోని కాపు నేతలు

కావలి, ఏప్రిల్ 15: రాష్ట్రంలో కాపుల కుప్రాధాన్యత కల్పించింది టీడీపీ ప్రభుత్వమేనని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాపుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు చెప్పారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో సోమవారం జిల్లా కాపునాడు అధ్యక్షుడు గుడ్డేటి ప్రసాద్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాటాడారు. కుప్పం నుంచి శ్రీకాకుళం వరకు పర్యటించి, కాపుల ఓట్లను టీడీపీకి వేయించేందుకు కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కాపు నాయకురాలు పద్మావతి శ్రీదేవి,జేపీసీ సభ్యులు సిద్దినూకరాజు, జనసేన జిల్లా కార్యదర్శి వెంకటసుబ్బయ్య, నేతలు దేవరకొండ శ్రీనివాసులు, ఆలా శ్రీనివాసులు, సాదు శ్రీధర్, కే. రామకృష్ణ పాల్గొన్నారు.

పేదల సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

● కొడవలూరును పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దుతా ● కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి



కొడవలూరు: కమ్మపాళెంలో మాట్లాడుతున్న ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, ఏప్రిల్ 15: నియోజకవర్గంలో కొడవలూరును పారిశ్రామికవాడగా తీర్చిదిద్ది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని కూటమి శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. మండలంలో కమ్మపాళెం, పెయ్యలపాళెం గ్రామాల్లో టీడీపీ సీనియర్ నాయకుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు పేదల సంక్షేమం, అభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా రావాలన్నారు. నియోజకవర్గంలో కమ్మపాళెం పంచాయతీలో మౌలిక వసతులు కల్పిస్తామని, సంజీవ్ నగర్‌లో చిన్నారులకు పాఠశాల నిర్మిస్తామని, నూతన రోడ్లు వేస్తామన్నారు. అవినీతి రహిత నియోజకవర్గ స్థాపనే తన లక్ష్యమన్నారు. ప్రజలు తనపై నమ్మకముంచి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం సంజీవ్ నగర్‌లో సుమారు 200 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ చేరారు. కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు కెవిఆర్ విజయ్ పర్య వేక్షించగా టీడీపీ నాయకులు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి, కిషోర్, జీవిఎస్ శేఖర్‌రెడ్డి, కేతూ వెంకటరమణారెడ్డి, చెక్కా మదన్, ప్రసాద్‌రెడ్డి, కుందుర్తి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేరుస్తా

విడవలూరు: ఎన్నికల్లో గెలిచిన వెంటనే గ్రామ ప్రజలకు ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తానని వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. పార్లపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ రామిశెట్టి స్వాతి, నాయకులు వేగూరు చంద్రారెడ్డి, ఉచ్చూరు సుదీప్‌రెడ్డి, రామిశెట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో టీడీపీ జాతీయ అధికారి ప్రతినిధి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కృష్ణచైతన్య, బీజేపీ, జనసేన నాయకులతో కలిసి సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో పర్యటించి కరపత్రాలను అందజేశారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు తాతా బాలకృష్ణ, చెముకుల శ్రీనివాసులు, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌రెడ్డి, పూండ్ల యోసేబు, బీజేపీ నాయకులు జానా కృష్ణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలి : కలెక్టర్

కోవూరు, ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్ పీఓలు, ఏపీవోలకు సూచించారు. స్థానిక గంగవరంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన పోలింగ్ అధికారుల శిక్షణ తరగతులను ఆయన పరిశీలించి ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎం మిషన్ వినియోగంపై పోలింగ్ సిబ్బందికి ఇస్తున్న శిక్షణను పరిశీలించి పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు పోలింగ్ అధికారులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోవూరు అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి శేతు మాధవన్, ఏఆర్‌ఓ విజయశ్రీ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ముత్తుకూరు, ఏప్రిల్ 15: అగ్ని ప్రమాదాల నివారణకు అదాని కృష్ణపట్నం పోర్టులో ప్రత్యేక విభాగం నిరంతరం కృషి చేస్తోందని పోర్టు సీఈవో జీజేరావు పేర్కొన్నారు. సోమవారం పోర్టులో నిర్వహించిన జాతీయ అగ్నిమాపక దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పించారు. పోర్టులో వారం రోజుల పాటు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, ఫైర్ సేఫ్టీ హెడ్ జి రవీంద్రనాథ్, వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు కమిషనర్ అభినందన

నెల్లూరు(సిటీ) : ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చూపిన మున్సిపల్ కార్పొరేషన్ జూనియర్ కళాశాల విద్యార్థులను కమిషనర్ వికాస్‌మర్మత్ సోమవారం కార్పొరేషన్ కార్యాలయం లో అభినందించారు. ఆయన మాట్లాడుతూ 93 మంది విద్యార్థులకు గాను 63 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. అన్ని విభాగాలలో విద్యార్థులు తమదైన శైలిలో మార్కులు సాధించారని ప్రశంసించారు. ప్రభుత్వ రంగ సంస్థల్లోని విద్యాలయాల్లో చదువుకుంటే ఫీజులు భారం ఉండద న్నారు. ఈ కార్యక్ర మంలో కళాశాల ఏవో రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ శివరాం ప్రసాద్‌లు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్‌పై రాళ్లదాడి దారుణం

నెల్లూరు(వైద్యం) : చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌పై రాళ్లదాడి దారుణమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి చెముకుల కృష్ణచైతన్య విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాన ప్రతిపక్ష నేతలపై దాడి చేస్తుంటే ఇంటలిజెన్స్ వ్యవస్థ ఏమిచేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ రాజనామాలు చేయాలన్నారు. లేదంటే ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు సాబీర్‌ఖాన్, శ్రీకుర్తి రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అసత్య ప్రచారాలు నమ్మొద్దు : నీలిమారెడ్డి



ఓట్లు అభ్యర్థిస్తున్న ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి

ఇందుకూరుపేట, ఏప్రిల్ 15: వైసీపీ నేతు అసత్య ప్రచారాలను నమ్మవద్దని కోవూరు శాసనసభ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి కుమార్తె నీలిమారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇందుకూరు పేట, పల్లెపాలెం బీసీ కాలనీలలో సోమవారం ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంపిణీచేసి తెలుగు దేశం ప్రభుత్వం రాగానే అమలుచేసే పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అధికారంలోకి రాగానే గ్రామాల్లో సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఎన్నికల్లో వేమిరెడ్డి దంపతులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రావెళ్ల వీరేంద్రచౌదరి, రాంప్రసాద్, బీజేపీ నాయకులు కైలాసం శ్రీనివాస్‌రెడ్డి, అవ్వారు ఏడుకొండలు, మునగాల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతిరెడ్డి గెలుపునకు కృషి చేయాలి

కొడవలూరు: కూటమి కోవూరు శాసనసభ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి గెలుపునకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి కోరారు. మం డలంలో గండవరంలో సోమ వారం టీడీపీ నాయకుడు డాక్ట ర్ వేమిరెడ్డి సిదార్థరెడ్డి ఆధ్వ ర్యంలో జరిగిన టీడీపీ కార్య కర్తల సమావేశంలో పట్టాభిరామిరెడ్డి పాల్గొని మాట్లాడుతూ నియోజకవర్గం అభివృద్ధి జరగాలంటే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఎమ్మెల్యేగా రావాలన్నారు. వైసీపీ పాలనకు చరమగీతం పాడి టీడీపీకి పట్టం కట్టాలన్నారు. అనంతరం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు .ఈ సమావేశంలో టీడీపీ నాయకులు అలం మాలకొండయ్య, రాఘవరెడ్డి , రషీద్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేస్తే టీడీపీ విజయం తథ్యం

తోటపల్లిగూడూరు : యువత కష్టపడి పనిచేస్తే తెలుగుదేశం పార్టీ విజయం తథ్యమని మండల అధ్యక్షుడు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఇస్కపాలెంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారీ మెజారిటీతో సోమిరెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మన్నెం జితేంద్రగౌడ్, సర్పంచ్ ఇంగిలాల చైతన్య, నెల్లపూడి సుధాకర్, మన్నెం కిరణ్, మన్నెం మధు, అవినాష్, రమేష్, మండల యువత, తదితరులు పాల్గొన్నారు.

పొదలకూరులో టీడీపీ ఇంటింటి ప్రచారం



అగచాట్లపురంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

పొదలకూరు : రాష్ట్రానికి మంచి రోజులు వస్తున్నాయని టీడీపీ సీనియర్ నాయకులు బోగోలు భాస్కర్‌రెడ్డి, మైనారిటీ నాయకులు షేక్ జమీర్, వెంపులూరు అరుణ అన్నారు. సోమవారం అగచాట్లపురం, సత్యనారాయణ ట్రేడర్స్ ప్రాంతాల్లో ఇంటింటికీ టీడీపీ కరపత్రాలను పంచుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మైనారిటీ మండల అధ్యక్షుడు ఖాదర్‌బాషా, రావూరు సుధీర్, దేవరం అమర్‌నాథ్‌రెడ్డి, సాయి సుదీషా, ముద్దు బాబు, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు కొంగి వెంకటరమణయ్య, కొంగి మస్తానమ్మ, భాస్కర్‌రెడ్డి, యువత, తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లికన్ పార్టీ కోవూరు అభ్యర్థిగా స్నేహలత



బీఫారం అందుకుంటున్న స్నేహలత

బుచ్చిరెడ్డిపాళెం : ప్రభుత్వ రిపబ్లికన్ పార్టీ కోవూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా బుచ్చి మండలం కొత్త కొండూరుపాళెంకు చెందిన గున్నం స్నేహలతను నియమిస్తూ ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి చెన్నకేశవులు సోమవారం జొన్నవాడలో బీఫారం అందజేశారు. ఈ సందర్భంగా గున్నం స్నేహలత మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రజలు ఎన్నికల్లో తనను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ ఒంగోలు జిల్లా అధ్యక్షుడు, నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి టీడీపీ సదస్సులు

పొదలకూరు, ఏప్రిల్ 15: పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద మంగళ, బుధవారాల్లో ముస్లిం మైనారిటీ, తెలుగు యువత ఆధ్వర్యంలో జరిగే సదస్సులను విజయవంతం చేయాలని టీడీపీ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో నేతలు తలచీరు మస్తాన్‌బాబు, షేక్ జమీర్‌బాషా విలేకరులతో మాట్లాడారు. తొలుత మండల టీడీపీ సీనియర్ నాయకుడు వెంపులూరు పుల్లయ్యగౌడ్‌ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ ఖాదర్‌బాషా, మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు ఆదాల సుగుణమ్మ, బొద్దులూరు మల్లికార్జుననా యుడు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అండగా ఉంటా !

● టీడీపీ అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ



సమస్యలు తెలుసుకుంటున్న లక్ష్మీసాయిప్రియ

సైదాపురం, ఏప్రిల్ 15: సైకిల్ గుర్తుపై ఓటు వేసి నన్ను ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే తాను మీకు అండగా ఉంటానని వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ అన్నారు. సోమవారం తుమ్మలతలుపూరు పంచాయతీలోని క్లస్టర్ ఇన్‌చార్జ్ పెమ్మసాని దిలీప్ చౌదరి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ సమస్యలను ఆమెకు స్థానికులు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీసాయిప్రియ మాట్లాడారు. నియోజకవర్గంలో తన తండ్రి ఎమ్మెల్యేగా కురుగొండ్ల రామకృష్ణ చేపట్టిన అభివృద్ధి తప్ప వైసీపీ ప్రభుత్వం ఏమి అభివృద్ధి చేపట్టలేదన్నారు. బాబు సూపర్-6 పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కట్టు మోహన్ కృష్ణారెడ్డి, మండల పరిశీలకుడు తానంకి నానాజీ, నాయకులు కొండూరు సుబ్రహ్మణ్యంరాజు, దశయ్యనాయుడు, మేడికొండ రమణయ్యనాయుడు, మురళీ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ



పెన్షనర్స్ పార్టీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నారాయణ

నెల్లూరు (విద్య) : నిరు పేదల కష్టాలు, బాధలన్నీ తెలు సుకున్నానని, వారి జీవితాల్లో వెలుగులు నిం పడమే లక్ష్యంగా పనిచేస్తానని మాజీమంత్రి, టీడీపీ నగర అభ్యర్థి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం ఆయన నగరంలోని 51వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. నెల్లూరులో అన్ని ప్రాంతాల్లో ఇప్పటికే 90 శాతం ఇళ్లకు వెళ్లాలనని, ఎంతోమంది పేదల తమ కష్టాలను తనతో పంచుకున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో తమకు జరిగిన మేలును, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అన్యాయాన్ని తెలియచేశారన్నారు. వారి బాధలు, కష్టాలన్నీ తీర్చగలిగే ప్రభుత్వం తెలుగుదేశం పార్టీనే అని గట్టిగా నమ్ముతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా తెలుగుదేశం పార్టీకి ఓటేసి తనను ఎమ్మెల్యేగా, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే 52వ డివిజన్‌లో నారాయణ సతీమణి రమాదేవి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నగరంలోని 9వ డివిజన్‌లో నారాయణ కుమార్తె పొంగూరు శరణి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అలాగే 47వ డివిజన్‌లో నారాయణ మరో కుమార్తె సింధూర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ నియంతృత్వ పాలనకు బుద్ధి చెప్పే సమయం ఆసన్నమైందని, రానున్న ఎన్నికల్లో నారాయణను గెలిపించాలని కోరారు.

● **ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ మద్దతు**

పొంగూరు నారాయణకు ఆంధ్ర పెన్షనర్స్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్న పార్టీ అధ్యక్షుడు పాలంకి సుబ్బరాయన్ తెలిపారు. నగరంలోని గోమతినగర్ నారాయణ క్యాంపు కార్యాలయంలో సోమవారం నారాయణను మర్యాదపూర్వకంగా కలసి పోస్టర్ల ను ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పెద్దన్న గౌడ్, పెన్షనర్స్ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ అధికారంలోకి వస్తేనే భవిష్యత్

● టీడీపీ రూరల్ అభ్యర్థి కోటంరెడ్డి



ప్రజలకు అభివాదం చేస్తున్న శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్ : నెల్లూరురూరల్, ఏప్రిల్ 15 : రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం అయితేనే మన బిడ్డల భవిష్యత్ బాగుంటుందని నెల్లూరురూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని పెనుబర్తి, కలివెలపాళెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూరల్ నియోజవర్గంలోని ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి వారి కష్టసుఖాల్లో భాగస్వామినవుతూ వచ్చానన్నారు. అదే ప్రేమానురాగాలు తనపై చూపారని చెప్పారు. రానున్న ఐదేళ్లలో 20 లక్షల మందికి ప్రైవేట్, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించడమే ధ్యేయంగా ఎన్నికల ప్రమాణం చేస్తున్నారన్నారు. అవ్వతాతలకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు పింఛన్ అందజేస్తారని, వలంటీర్లను మరింతగా గౌరవించి రూ.10 వేలు జీతంగా ఇవ్వనున్నామన్నారు.

కుటుంబ సభ్యుల ఇంటింటా ప్రచారం

హౌసింగ్‌బోర్డు కాలనీ, కేశవులనగర్, న్యూ మిలటరీకాలని, జర్నలిస్టుకాలనీల తదితర ప్రాంతాలలో కోటంరెడ్డి సతీమణి సుజీతమ్మ, ఆయన కుమార్తెలు హైందవి, వైష్ణవిలు రెండవ విడత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముందుగా నియోజకవర్గంలోని ఆర్‌ఎంపీ వైద్యులు, 17వ డివిజన్ ఆకుతోటకు చెందిన చేవూరి శ్రీనివాసులు, శశిధర్‌లుకు నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాలలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 15 : జగన్ రాక్షస పాలనకు చరమగీతం పాడాలని, అమ్మఒడి.. నాన్న బుడ్డి తప్ప ఏ సంక్షేమం అమలు కాలేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీహరి నాయుడు ధ్వజమెత్తారు. సోమవారం జర్నలిస్టు భవన్‌లో నెల్లూరు జిల్లా బలిజ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, నియంత రాజ్యం ఏలుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని బలిజ, తెలగ, కాపులు ఐక్యమై ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ బలిజ సంఘం అధ్యక్షుడు శ్రీహరిరాయలు బలిజ సంఘీయులు పాల్గొన్నారు.

సామాన్య రోగికి కార్పొరేట్ వైద్యమే మా లక్ష్యం

● దేవిరెడ్డి శారదా ట్రస్ట్ చైర్మన్ దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(వైద్యం), ఏప్రిల్ 15 : సామాన్య వ్యక్తికి సైతం కార్పొరేట్ వైద్యం అందించాలన్న ఉద్దేశంతో దేవిరెడ్డి శారద సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం చేపడుతున్నట్లు దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం నగరంలోని బీవీ నగర్‌లో ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టిన ఊరుకు సేవచేయాలన్న తలంపుతో దేవిరెడ్డి శారద చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఈ ట్రస్ట్ ద్వారా అల్లూరు పరిసర ప్రాంతాలలో ప్రజలకు ఉచిత విద్య, వైద్యం, స్కిల్స్ కేంద్రాల ద్వారా ఉపాధి శిక్షణ వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అదే విధంగా పేదలకు తక్కువ ఖర్చుతో కార్పొరేట్ వైద్యం అందేలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. సింహపురి వైద్య సేవా సమితి నిర్వహణలో ఈ ఆసుపత్రి నడుస్తుందని చెప్పారు. ఆ కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, దక్షిణమధ్య రైల్వే సంచాలకులు దూసి రామకృష్ణ, సహక్షేత్ర ప్రచారక్ భరత్‌కుమార్, సింహపురి వైద్య సేవాసమితి చైర్మన్ పొన్నలూరి సీతారామిరెడ్డి, జాయింట్ మేనేజింగ్ ట్రస్ట్ దేవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, దేవిరెడ్డి రఘురామిరెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సానుభూతి కోసమే గులకరాయి డ్రామా : కోటంరెడ్డి



ఓట్లు అభ్యర్థిస్తున్న కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), ఏప్రిల్ 15 : ప్రజల్లో సానుభూతి కోసమే ముఖ్యమంత్రి జగన్ గులకరాయి డ్రామా ఆడుతున్నారని, ఇలాంటివి ప్రజలు నమ్మే పరిస్థితి లేదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. నగరంలోని 14వ డివిజన్ బాలాజీనగర్, ఏసీ నగర్ పరిసర ప్రాంతాల్లో సోమవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జరగనున్న ఎన్నికల్లో ఓటమి జగన్‌రెడ్డికి కళ్ల ముందు కనిపిస్తోందని అందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేసి సానుభూతి పొందే కుట్రలో భాగంగానే ఆయనపై గులకరాయి దాడి జరిగిందని విమర్శించారు. గతంలో కోడికత్తి దాడి, బాబాయి హత్య వంటి ఘటనల మాదిరిగా లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో పొంగూ రు నారాయణ, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్, నాయకులు గంగపట్నం శివకుమార్, పసుపులేటి మల్లికార్జు న తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలు కాపాడేది టీడీపీ ప్రభుత్వమే : కేతంరెడ్డి



కరపత్రాలు పంచుతున్న కేతంరెడ్డి

నెల్లూరు (విద్య) : రాజ్యాంగ విలువలు కాపాడేది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమేనని టీడీపీ నాయకుడు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి తెలిపారు. నగరంలోని 53వ డివిజన్‌లో సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి మాట్లాడారు. గడిచిన ఐదేళ్లలో ప్రజల స్వేచ్ఛను హరించి వైసీపీ ప్రభుత్వం రాజ్యాంగానికి తూట్లు పొడించిందని విమర్శించారు. రానున్న కూటమి ప్రభుత్వంతో రాజ్యాంగ విలువలు కాపాడే విధంగా పరిపాలన ఉంటుందన్నారు. ప్రజలంతా కూడా ఎంపీగా వీపీఆర్‌ను, ఎమ్మెల్యేగా నారాయణను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు రాచగిరి చంద్ర, మూలం భాస్కర్, కంపా ఈశ్వరయ్య, టి.విశ్వనాథ్, కర్నాటి సుధాకర్‌రెడ్డి, వినయ్‌కుమార్, బాజి, సాహెబ్నా తదితరులు పాల్గొన్నారు.

యువతకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

నెల్లూరు(సాంస్కృతికం), ఏప్రిల్ 15 : అన్ని రంగాలతోపాటు యువతకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఐవైఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కరిముల్లా ఖాన్ రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం జర్నలిస్టు భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. యువత ఉజ్వల భవిష్యత్ కోసం ఐవైఎం ఎన్నో పోరాటాలు చేస్తోందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

బటన్ నొక్కుడు సీఎం మనకొద్దు !

● జగన్మోహన్‌రెడ్డి ఓ హిట్లర్ ● బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్

వెంకటాచలం, ఏప్రిల్ 15 : సర్పంచ్‌ల డబ్బులు లాగేసుకున్నారని, బటన్ నొక్కుడు సీఎం రాష్ట్రానికి వద్దు బీజేపీ తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపూడి వరప్రసాద్‌రావు అన్నారు. మండలంలోని నిడిగుంటపాలెంలో బీజేపీ మండల అధ్యక్షులు కుంచి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం జరిగిన ప్రచారంలో సర్వేపల్లి అభ్యర్థి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డితో కలిసి వరప్రసాద్ పాల్గొని మాట్లాడారు. అధికారం ఎవరి సొత్తు కాదని, జగన్‌మోహన్‌రెడ్డి తనకు చాలా అన్యాయం మండిపడ్డారు. కక్షసాధింపు ఉండేది పిరికివాడికని, మంత్రి కాకాణి ఒక పిరికివాడంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో అవినీతి పోవాలంటే చంద్రబాబు, సర్వేపల్లిలో రాక్షస పాలన పోవాలంటే సోమిరెడ్డి గెలిపించాలని, తనకు ఈసారికి అవకాశం ఇవ్వాలని కోరారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. సోమిరెడ్డి మాట్లాడుతూ మళ్లీ కాకాణిని గెలిపిస్తే సర్వేపల్లి నియోజకవర్గాన్ని అమ్మేస్తాడని విమర్శించారు. కాకాణి నియంత, అరాచకపు పాలనకు ప్రజలు చరమగీతం పాడాలన్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులను నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావూరి రాధాకృష్ణమనాయుడు, బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

● **కసుమూరు దర్గాలో..**

కసుమూరు మస్తాన్ వలీ దర్గాను వరప్రసాద్‌రావు దర్శించుకున్నారు. దర్గాలో ఆయన పేరిట ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం కసుమూరులో ప్రచారం నిర్వహించారు. ముస్లిం మైనార్టీలను కలిసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాకుటూరు రవీంద్రరెడ్డి, ఆరుముళ్ల మురళీ, సుబ్రహ్మణ్యంరెడ్డి, మాధవ్, కరీముల్లా, అన్వర్, మౌలానా, శేషయ్య, వెంకటాద్రి పాల్గొన్నారు.





కూటమి అభ్యర్థులు వరప్రసాద్, సోమిరెడ్డిలను సత్కరిస్తున్న అభిమానులు, కసుమూరులో ఓటు అభ్యర్థిస్తున్న ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌రావు


చిరిగిపోయిన ఫ్లెక్సీతో ఉన్న టీడీపీ ప్రచార వాహనం

టీడీపీ ప్రచార వాహనంపై 'వైసీపీ' దాడి

పెళ్లకూరు, ఏప్రిల్ 15: టీడీపీ ప్రచార వాహనంపై వైసీపీ కార్యకర్త దాడి చేశాడు. టీడీపీ నాయకులు తెలిపిన వివరాల మేరకు.. పెళ్లకూరు మండలంలోని చిల్లకూరు గ్రామంలో సోమవారం ప్రచారం చేస్తున్న టీడీపీ వాహనంపై అదే గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త ఆళ్ల నాగార్జున దాడికి దిగాడు. వాహనానికి కట్టి ఉన్న ఫ్లెక్సీలను కర్రతో కొట్టి చించేశాడు. అనంతరం వాహన డ్రైవర్ నెలవల గోపిపైనా కర్రతో దాడికి యత్నించగా, స్థానికులు నిలువరించారు. దాంతో వాహనాన్ని తీసుకుని డ్రైవర్ అక్కడినుంచి తప్పించుకుని వచ్చేశాడు. ఈ సమాచారం తెలుసుకున్న సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం వెంటనే ఎస్పీ కృష్ణకాంత్ పటేల్‌కు ఫిర్యాదు చేశారు. మరోవైపు డ్రైవర్ కూడా పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశాడు. స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ గ్రామానికి చేరుకుని విచారించి, నాగార్జున ఆచూకీపై ఆరా తీశారు. సాయంత్రం స్థానిక టీడీపీ నేతలతో కలిసి నెలవల సుబ్రహ్మణ్యం పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని దాడికి పాల్పడిన వారితోపాటు అతడిని ప్రోత్సహించిన ఎన్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని ఎస్ఐని కోరారు. దీనిపై ఎస్ఐ మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధలను అతిక్రమించి, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాడికి పాల్పడిన వ్యక్తిపై ఎన్నికల నిబంధనల మేరకు కేసు నమోదు చేసి, చర్యలు తీసుకుంటామని చెప్పారు.


ఎస్ఐతో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం, టీడీపీ నేతలు

సూళ్లూరుపేట వైసీపీలో ఆరని జ్వాలలు

తారస్థాయికి చేరిన ఎమ్మెల్యే అనుకూల, వ్యతిరేక వర్గాల విభేదాలు

ఎన్‌డీసీసీబీ చైర్మన్ నుంచి నాకు ప్రాణహాని : పోలీసులకు పట్టణ అధ్యక్షుడి ఫిర్యాదు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15: సూళ్లూరుపేట వైసీపీలో వర్గవిభేదాల కారణంగా చెలరేగిన జ్వాలలు ఇప్పట్లో ఆరేలా లేవు. వర్గవిభేదాలు తారస్థాయికి చేరాయి. కొంతకాలంగా ఎన్‌డీసీసీబీ (నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు) చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి (ఎమ్మెల్యే అనుకూల వర్గం), సూళ్లూరుపేట వైసీపీ పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డి (ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం) మధ్య వర్గవిభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. ఇరువర్గాలూ పరస్పరం పోలీసులకు ఫిర్యాదు కూడా చేసుకుని ఉన్నారు. ఎన్నికల వేళ వర్గవిభేదాలు మంచిది కాదని పార్టీ అధిష్ఠానం పెద్దలు ఇరు వర్గాలకు నచ్చచెప్పారు. అయినా వారు ఎడముఖం పెడముఖంగా ఉంటున్నారు. ఈనేపథ్యంలో సూళ్లూరుపేట పట్టణంలో ఆదివారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తొలిసారిగా ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి వర్గీయులు.. కళత్తూరు శేఖర్‌రెడ్డిపై దాడికి యత్నించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి, సర్దుబాటు చేయాల్సి ఉంది. మరోవైపు పార్టీ నాయకుడిపై ప్రచారంలో దాడికి దిగడం ఏంటంటూ మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు కళత్తూరు సునీల్‌రెడ్డిలు శేఖర్‌రెడ్డికి మద్దతుగా ప్రతిఘటనకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యేతోపాటు ఎంపీపీ అల్లూరు అనిల్‌రెడ్డి పలువురు పార్టీ నాయకులు శేఖర్‌రెడ్డి వర్గీయులకు నచ్చచెప్పి అక్కడినుంచి పంపించేశారు. ఈ క్రమంలో సత్యనారాయణరెడ్డి నుంచి తనకు ప్రాణహాని ఉందంటూ శేఖర్ రెడ్డి సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రహీంరెడ్డికి ఫిర్యాదు చేశారు.


ఎస్ఐ రహీం రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కళత్తూరు శేఖర్ రెడ్డి

కాల్చి చంపేస్తానంటున్న ఎన్‌డీసీసీబీ చైర్మన్

- వైసీపీ పట్టణ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి

ఎన్‌డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి చేసే గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాను ప్రశ్నించాననే తనపై కక్ష కట్టాడని సూళ్లూరుపేట వైసీపీ పట్టణ అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి సోమవారం మీడియాకు తెలిపారు. ప్రచారంలో ఉన్న తనపై ఆయన వర్గీయులతో దాడి చేయించాలని చూశారని ఆరోపించారు. 'నిన్ను నా గన్‌మ్యాన్‌తో కాల్చి చంపేస్తాను. ఎవరూ నిన్ను కాపాడరు' అని ఎన్‌డీసీసీబీ చైర్మన్ పదే పదే బెదిరిస్తున్నాడని శేఖర్‌రెడ్డి వాపోయారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యేకి సైతం చెప్పానని, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అలాగే ప్రచారంలో తనపై దాడికి ప్రయత్నించిన వారిపై కేసు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


పలమనేరులో షర్మిల సభకు తరలివచ్చిన జనం


బంగారుపాళ్యంలో సోమవారం రాత్రి జరిగిన సభలో అభివాదం చేస్తున్న షర్మిల

నారాయణస్వామి లిక్కర్ బాటిల్ మంత్రి

- నాసిరకం మద్యం అమ్మించడంతో పెరిగిన మరణాలు
- వెంకటేగౌడకు మరోసారి ఓటేస్తే ప్రజల్నీ అమ్మేస్తాడు
- ఎన్నికల సభల్లో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర విమర్శ
- కాంగ్రెస్‌ను గెలిపించాలంటూ ఓటర్లకు పిలుపు

పలమనేరు/బంగారుపాళ్యం/కార్వేటినగరం, ఏప్రిల్ 15: జిల్లాలో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ మీద పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా ఆగ్రహించారు. కార్వేటినగరం, పలమనేరు, బంగారుపాళ్యంలలో ఆమె పర్యటన సాగింది. కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. అదే సమయంలో వైసీపీ ప్రభుత్వంపై, ఇద్దరు ఎమ్మెల్యేలపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు.

కార్వేటినగరం సభలో..

'జగన్‌తో పాటు నారాయణస్వామికి ఓట్లేసి గెలిపించారు. ఆయన డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ మినిస్టర్ అంట కదా.. అంటే ఏమిటో తెలుసా.. లిక్కర్ బాటిల్ మంత్రి. లిక్కర్ షాపుల్లో భూం భూం, స్పెషల్ స్టేటస్, ప్రెసిడెంట్ మెడల్ అన్నీ ఈయనవే అంట కదా. బాగా సంపాదించారు. దళితుడు. అంబేడ్కర్ శిష్యుడ్ని అని చెప్పుకుంటాడు కదా. అంబేడ్కర్ ఆశయాలను నిలబెట్టడం అంటే మద్యం అమ్మడమా.. అది కూడా కల్తీ మద్యం అమ్మడమా.. నాసిరకం మందుతో మిగతా రాష్ట్రాల కంటే మన రాష్ట్రంలో 25 శాతం ఎక్కువ మంది కిడ్నీలు, లివర్లు చెడిపోయి చనిపోతున్నారు. అయినా అవే నాసిరకం మద్యం అమ్మకాలు. బయట క్వార్టర్ బాటిల్ రూ.60 అయితే, మన వద్ద రూ.250 అమ్ముతున్నారు. నిజమేనా?' అని జనాన్ని అడిగారు. వారి నుంచి సమాధానాలు రాబట్టారు.

పలమనేరు సభలో..


'మీ ఎమ్మెల్యే వెంకటేగౌడ పరిపాలన ఎలా ఉంది? ఎప్పుడైనా వస్తున్నారా? సమస్యల్ని పరిష్కరిస్తున్నారా? మీరు ఓటేసి గెలిపిస్తే నెత్తి మీద టోపీ పెట్టారు. ఇసుక, మట్టి మాఫియాతో బాగా సంపాదించారు. నదిలో ఇసుక లేకుండా మొత్తం అమ్ముకున్నాడట కదా. మరోసారి ఓటేస్తే మిమ్మల్ని కూడా అమ్మేస్తాడు. నియోజకవర్గంలోని భూముల్ని, ప్రజల్ని మొత్తంగా అమ్మేస్తాడు' అంటూ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

బంగారుపాళ్యం సభలో.. : 'ఈసారి ఎన్నికల్లో వైసీపీ, టీడీపీ అభ్యర్థులు బాగా డబ్బులిస్తారు. ఎవరు డబ్బిచ్చినా తీసుకోండి. కానీ ఓటు మాత్రం మనస్సాక్షి మేరకు వేయండి. ఓటు తల్లి, చెల్లి లాంటిది. అమ్ముకోకండి. జగన్ చెప్పిన వాగ్దానాలన్నీ మద్యం షాపుల్లో నిలబెట్టుకున్నారు. అమ్మఒడి ఇద్దరికి ఇస్తానని ఒకరికే ఇస్తున్నారు. మరోబిడ్డను దత్తత ఇచ్చేయాలా? చంపేసుకోవాలా? పులి కడుపున పులే పుడుతుంది. నా గుండెల్లో నిజాయితీ ఉంది. గెలిపించండి. వైఎస్సార్ సంక్షేమాన్ని తెస్తాను' అని జనానికి హామీలిచ్చారు.

అభ్యర్థులను గెలిపించమని..

కార్వేటినగరం, పలమనేరు, బంగారుపాళ్యం మండలాల్లో జరిగిన బహిరంగ సభల్లో జీడీనెల్లూరు, పలమనేరు, పూతలపట్టు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థులు రమేష్‌బాబు, శివశంకర్, ఎంఎస్ బాబులను పరిచయం చేశారు. ఓట్లేసి గెలిపించాలని, అందుబాటులో ఉండి సమస్యల్ని పరిష్కరిస్తారని కోరారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో ఎమ్మెల్యే అభ్యర్థులతో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, బంగారుపాళ్యంలో వామపక్ష నాయకులు ప్రసంగించారు.

కరచాలనాలు.. ఆత్మీయ పలకరింపులు



ప్రతి సభలోనూ పదే పదే 'హస్తం గుర్తుకు ఓటేయండి. హస్తం గుర్తును మర్చిపోకండి'అంటూ షర్మిల కోరుతూ హస్తం గుర్తును ఫ్లకార్డును చేత్తో పట్టుకుని చూపించారు. ఆశీర్వదించండి అంటూ పదే పదే కోరారు. రొటీన్‌గా ప్రసంగించకుండా హాజరైన వారిని ప్రశ్నలడిగి జవాబులు చెప్పించారు. మూడు సభల్లోనూ పెద్దఎత్తున షర్మిలను చూసేందుకు, ఆమె ప్రసంగం వినేందుకు ప్రజలు తరలివచ్చారు. మహిళలు, వృద్ధులు, ముస్లింలు అధిక సంఖ్యలో కనిపించారు. ముఖ్యంగా మహిళలు భుజాన కాంగ్రెస్ జెండా కర్ర వేసుకుని ఉత్సాహంతో తిరిగారు.



రూ.31.50 లక్షల సీజ్

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15: ఎన్నికల నేపథ్యంలో బిల్లులు, రసీదులు లేకుండా తీసుకెళుతున్న రూ.31.50 లక్షలను తిరుపతి ఈస్ట్ పోలీసులు సోమవారం సీజ్ చేశారు. డబ్బు తీసుకెళుతున్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఈస్ట్ సీఐ తెలిపిన వివరాల మేరకు.. సీఐ మహేశ్వరరెడ్డి, ఎస్ఐలు పురుషోత్తమరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి సోమవారం పాత మున్సిపల్ ఆఫీసు నుంచి లీలామహల్ సర్కిల్ వైపు వస్తున్న వాహనాలు తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా కనిపించిన ఓ కారును ఆపి తనిఖీ చేశారు. అందులో రూ.31.50 లక్షలను గుర్తించారు. బిల్లులు, రికార్డులు లేకపోవడంతో సీజ్ చేశారు. వాహనంలోని కరకంబాడికి చెందిన రెడ్డిబాషా, ఉదయభానుమూర్తిలను విచారించి, పంపారు. సీజ్ చేసిన నగదును ఆదాయ పన్ను శాఖ అధికారులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరు నమోదుకు 5,892 దరఖాస్తులు

ముగిసిన గడువు ● 25న జాబితా విడుదల

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 15: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఏప్రిల్ ఒకటో తేదీనాటికి 18 సంవత్సరాలు నిండిన వారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి కేంద్ర ఎన్నికల సంఘం విధించిన గడువు ఆదివారం అర్ధరాత్రితో ముగిసింది. 15వ తేదీ సాయంత్రం నాటికి ఫారం-6 ద్వారా జిల్లావ్యాప్తంగా 5,892 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. ఇందులో నియోజకవర్గాలవారీగా.. చంద్రగిరిలో 1,200, తిరుపతిలో 1,000, గూడూరులో 870, శ్రీకాళహస్తిలో 830, సూళ్లూరుపేటలో 800, వెంకటగిరిలో 650, సత్యవేడులో 400 ఉన్నాయి. వెయ్యి పరిష్కారం కాగా, 4,892 దరఖాస్తులను అధికారులు పరిశీలిస్తున్నారు. ఈనెల 25న తుది ఓటర్ల జాబితా రానుంది. గడువు ముగిసినా దరఖాస్తులు స్వీకరిస్తారని, జూన్ 6వ తేదీ తర్వాత వాటిని పరిశీలించి, వచ్చే ఎన్నికలకు ఓటు హక్కు కల్పిస్తామని అధికారులు తెలిపారు. కాగా, తిరుపతి నగరంలో 35వేలకుపైగా బోగస్ ఓట్లు ఉన్నాయని, చంద్రగిరిలోనూ అదే పరిస్థితి ఉందని టీడీపీ నేతలు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ఎన్నికల అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. వాటిని తొలగించి పారదర్శకమైన ఓటర్ల జాబితాను ఇవ్వాలని కోరుతున్నారు. అధికారులెలా స్పందిస్తారో వేచి చూడాలి.

25నాటికి ఇంటిగ్రేటెడ్ ఓటర్ల జాబితా: కలెక్టర్

ఓటర్ల జాబితాకు సంబంధించి ఈనెల 14 వరకు వచ్చిన క్లెయిమ్‌లను 22వ తేదీలోపు పూర్తి చేయాలని సోమవారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ ద్వారా అధికారులను కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల నామినేషన్ ఆఖరు తేదీ 25 నాటికి ఇంటిగ్రేటెడ్ ఓటర్ల జాబితా సిద్ధం కావాల్సి ఉంటుందన్నారు.

బంగారం ధరధగలు

నెల రోజుల్లోనే గ్రాముపై రూ.1,200 పెరుగుదల



తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15: బంగారం ధర అమాంతం పెరుగుతోంది. నెల రోజుల వ్యవధిలోనే గ్రాము బంగారంపై రూ.1,200 పెరిగింది. మూడు నెలల వ్యవధిలో 20శాతం పెరుగుదల కనిపించిందని తిరుపతి లోని స్వర్ణ వ్యాపారులు చెబుతున్నారు. మునుపటిలా కాకుండా కరోనా తరువాత ధర పైపైకి ఎగబాకుతూనే ఉంది. 24 క్యారెట్ల బంగారం నెల కిందట గ్రాము ధర రూ.6,300 ఉండగా, సోమవారం నాటికి రూ.7,500 చేరుకుంది. శుభ ముహూర్తాల వేళ బంగారం ధర పెరగడంపై జనం ఆందోళన వ్యక్తం చేస్తుండగా ఇన్వెస్టర్లు మాత్రం ఖుషీగా ఉన్నారు. ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య యుద్ధ వాతావరణమే దీనికి కారణంగా వ్యాపారులు అభిప్రాయపడుతున్నారు. రానున్న రోజుల్లో ధర మరింత పెరిగే అవకాశం ఉందంటున్నారు. జిల్లాలో దాదాపు 430 బంగారం దుకాణాలుండగా అందులో రోజుకు రూ.6.50 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నాయి. తిరుపతిలోనే ఏడు కార్పొరేట్ దుకాణాలున్నాయి. చిన్నా చితకా మరో 154 వరకు షాపులున్నాయి. వీటిల్లో మాత్రమే దాదాపు రూ.3.20కోట్ల వరకు వ్యాపారం జరుగుతోంది.

గత ఏడాది ఏప్రిల్‌లో గ్రాము రూ.5,568

గత ఏడాది ఏప్రిల్‌లో గ్రాము బంగారం రూ.5,568 వరకు పలికింది. ఈ ఏడాది ఏప్రిల్ నాటికి రూ.1,932 పెరిగి అపరంజి బంగారం ధర రూ.7,500 పలుకుతోంది. 22 క్యారెట్ల బంగారం ధర రూ.6,689 చేరుకుంది. ఇంతలా ధరలు పెరగడంతో కొనుగోలుదారుల్లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి.

కల్లివెట్టులోనూ రాజేష్‌కి నిరసన సెగ

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 15: ఎన్నికల ప్రచారానికి వెళ్లిన సత్యవేడు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్‌కు కల్లివెట్టులోనూ నిరసన సెగ తగిలింది. మాకేం మేలు చేశారంటూ ఆదివారం కేవీబీపురం మండలం కళత్తూరు దళితవాడకు చెందిన వైసీపీ నాయకులు.. రాజేష్ కారును అడ్డగించిన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కల్లివెట్టు గ్రామస్తులు రాజేష్‌ని నిలదీశారు. వైసీపీ కోసం అహర్నిశలు పనిచేస్తున్న తమకు సమాచారం ఇవ్వకుండా గ్రామానికి ఎన్నికల ప్రచారానికి ఎలా వస్తారని ప్రశ్నించారు. దీంతో ఆయన వారికి సర్దిచెప్పాల్సి వచ్చింది.

ఎస్వీయూ దూరవిద్య డిగ్రీ ఫలితాల విడుదల

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 15: ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో గత ఏడాది సెప్టెంబరులో నిర్వహించిన దూరవిద్య డిగ్రీ మొదటి సంవత్సరం (బీఏ, బీకాం, బీఎస్సీ) ఫలితాలు విడుదలయ్యాయి. మనబడి, స్కూల్స్9.. వెబ్‌సైట్లలో ఫలితాలు పొందుపరిచినట్లు సీఈ దామ్లా నాయక్ తెలిపారు.

రాక్షస పాలనను అంతమొందించాలి: పాశం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న పాశం సునీల్‌కుమార్

గూడూరు, ఏప్రిల్ 15: రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం సాగిస్తున్న రాక్షస పాలనను అంతమొందించాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఆయన సతీమణి సంధ్యారాణి అన్నారు. సోమవారం స్థానిక నరసింగరావుపేటలో సూపర్ సిక్స్ పథకాలపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ పేరుతో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం దోచుకోవడమే పనిగా పాలన సాగించారన్నారు. అవినీతిని ప్రశ్నించే వారిపై దాడులకు దిగడం, అక్రమ కేసులు బనాయించడం వంటి దుర్మార్గాలకు ఒడిగట్టారని ధ్వజమెత్తారు. యువతకు ఉపాధి చూపకపోవడంతో ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సివస్తోందని, కొంతమంది యువత చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే యువత, మహిళలు, రైతులతో పాటు అన్ని వర్గాల ప్రజలకు పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేయడం జరుగుతుందన్నారు. గాడితప్పిన రాష్ట్రాన్ని సరైన అభివృద్ధి మార్గంలో నడిపించే సత్తా చంద్రబాబునాయుడుకే ఉందని, త్వరలో జరిగే ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, కనుమూరు హరిచంద్రారెడ్డి, ఆరికట్ల మస్తాన్‌నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, కేశవ, ఉమాశంకర్‌నాయుడు, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, చంద్రశేఖర్, చంద్రనీల్, గుండాల లీలావతి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లను బెదిరించి రాజీనామా చేయించడం సరికాదు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 15: వైసీపీ నాయకులు వలంటీర్లను బెదిరింపులకు గురిచేసి రాజీనామా చేయించడం మంచిపద్ధతి కాదని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వలంటీర్లపై వైసీపీ నాయకులు చేస్తున్న దౌర్జన్యాలను మానుకోవాలన్నారు. ఉద్యోగాలు కల్పిస్తామని యువతను మోసంచేసిన ప్రభుత్వం వలంటీర్ల ఉద్యోగాలు కల్పించి రూ.5వేలు మాత్రమే వేతనాలుగా ఇస్తోందన్నారు. ప్రజాధనాన్ని వేతనంగా తీసుకుంటున్న వలంటీర్లను వైసీపీ కార్యకర్తలుగా చూడడం సరికాదన్నారు. వలంటీర్లు ఏ రాజకీయ పార్టీలకు పనిచేయకుండా తటస్థంగా ఉంటూ తమ విధులను నిర్వహించాలని సూచించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే వలంటీర్ల వేతనాన్ని రూ. 10వేలకు పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, వెంకటేశ్వర్లురెడ్డి, నరసింహులునాయుడు, రవీంద్రరెడ్డి, వాటంబేడు శివకుమార్, జనార్దనరెడ్డి, శివకుమార్, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోనే బీసీలకు గుర్తింపు



ఊట్లపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

బాలాయపల్లి, ఏప్రిల్ 15: టీడీపీలోనే బీసీలకు గుర్తింపు లభిస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు అన్నారు. గురువారం మండలంలోని ఊట్లపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా లక్ష్మీసాయిప్రియ, ఎంపీ అభ్యర్థిగా వెలగపల్లి వరప్రసాదరావును గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందడంతో పాటు ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో రాయి సత్యంనాయుడు, కూను శ్రీహరి, దాసరి రాజగోపాల్ నాయుడు, గోళ్ల మధు యాదవ్, దుర్గాటి నరసింహులు, ఆదిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, కొర్రపాటి రామచంద్ర నాయుడు, దాసరి కోటేశ్వరావు, జనార్దనరెడ్డి, జడపల్లి కోటేశ్వరావు, పులకంటి మురళి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి సహకరించండి

వెంకటగిరి, ఏప్రిల్ 15: త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ విజయానికి సహకరించాలని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద గాండ్లకుల పెద్దలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియతో కలిసి రామకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్క అవకాశం ఇవ్వండంటూ గద్దెనెక్కిన జగన్ నవరత్నాల పేరుతో ప్రజలను మోసగించారని అన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ఇచ్చిన ఆర్థిక సాయాన్ని పన్నులు, చార్జీల రూపంలో వడ్డీతో సహా వసూలు చేశారని విమర్శించారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలకు అడ్డుకట్టవేయాలంటే రానున్న ఎన్నికల్లో చంద్రబాబుకు పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. వెంకటగిరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న తన కుమార్తె కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియను గెలిపించాలని కోరారు. హైదరాబాద్‌కు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లను వెంకటగిరి స్టేషన్‌లో నిలపాలని, వెంకటగిరి - నెల్లూరు మార్గంలో బస్సు సౌకర్యాలను మెరుగు పరచాలని, పట్టణంలోని శ్మశాన వాటికలను అధునాతన వసతులతో అభివృద్ధి పరచాలని కొందరు కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కులపెద్దలు భద్రి నవీన్, చిరువెళ్ల ప్రభాకర్, కందాటి మోహన్, యారం శ్రీనివాసులు, భద్రి మల్లికార్జున్, రమణయ్య, సురేంద్ర, భద్రి రాజా, వీరీ స్వామి, అజయ్, జనార్దన్ పాల్గొన్నారు.

టీడీపీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తీగల సురేష్‌బాబు

కోట, ఏప్రిల్ 15: త్వరలో జరగబోయే ఎన్నికల్లో టీడీపీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ఆ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి తీగల సురేష్‌బాబు, క్లస్టర్ ఇన్‌చార్జి పాదర్తి కోటేశ్వరరెడ్డి, బీసీసెల్ అధ్యక్షుడు కందల బాలకృష్ణయాదవ్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గూడలి పంచాయతీలో గల ప్రకాశం కాలనీలో సోమవారం క్లస్టర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయా నాయకులు మాట్లాడుతూ త్వరలో జరగబోయే ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ఆయా గ్రామ కమిటీల అధ్యక్షుడు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరినీ అవగాహన పరిచి విధిగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటింటా తిరిగి సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కలిగించాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు వెంకటకృష్ణారెడ్డి, బీసీ సెల్ నాయకులు చాపల శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.80 కోట్లు

తిరుమల, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.80 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ప్రకటించింది.

వలంటీర్ల రాజీనామా

పెళ్లకూరు, ఏప్రిల్ 15: పెళ్లకూరు మండలంలోని 216 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. తమ రాజీనామాలను ఎంపీడీవో అన్నపూర్ణరావుకు అందజేశారు.

గూడూరు అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 26మంది వలంటీర్లు తమ రాజీనామాలను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు అందజేశారు.

కోట: మండలంలోని వెంకన్నపాళెం పంచాయతీ పరిధిలోని 9మంది వలంటీర్లు రాజీనామా చేశారు. ఎంపీడీవో శంకరయ్యను కలిసి రాజీనామా పత్రాలను అందజేశారు.

తడలో పోలీసుల కవాతు

తడ, ఏప్రిల్ 15: తడలో పోలీసులు కవాతు నిర్వహించారు. సోమవారం సాయంత్రం కేంద్ర బలగాలతో కలసి స్థానిక పోలీసులు తడ బజారువీధులు, హైస్కూల్ వీధిలో కవాతు చేపట్టారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకుకోవాలని పోలీసులు కోరారు. బృందంలో సూళ్లూరుపేట సీఐ మధుబాబు, ఎస్ఐ నరసింహరావు, సిబ్బంది ఉన్నారు.

కామిరెడ్డీ... నీ ఆటలు సాగనివ్వం: నెలవల



మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ నెలవల

పెళ్లకూరు, ఏప్రిల్ 15: ఆటవిక విధానాలతో దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి ఆటలు ఇకపై సాగనివ్వబోమని సూళ్లూరుపేట నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. సోమవారం పెళ్లకూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ అన్ని అనుమతులు తీసుకుని శాంతియుతంగా ప్రచారం చేస్తున్న టీడీపీ వాహనంపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. సత్యనారాయణరెడ్డి చిల్లకూరును తన సామ్రాజ్యంలా భావిస్తూ ఎవ్వరినీ అడుగుపెట్టనివ్వను అని అహంకార ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరగాలని తాము కోరుకుంటున్నామని, వైసీపీ నేతలు దాడులకు దిగితే ఏమాత్రం సహించబోమని హెచ్చరించారు. ఇటీవల అక్రమ గ్రావెల్ తవ్వకాల విషయమై వైసీపీ అగ్రకుల నేతల మధ్య జరిగిన గొడవల్లోకి దళితలను లాగి పరస్పరం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు. ఈ సంఘటన జరిగి నాలుగు నెలలు కావస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు. ప్రశాంతతకు నిలయమైన సూళ్లూరుపేటలో వైసీపీ నేతలు ఒకరిపై మరొకరూ దాడులకు దిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని విమర్శించారు. శాంతియుత వాతావరణంలో ఎన్నికలకు సహకరించాలని, అడ్డగోలుగా వ్యవహరిస్తే మీ ఆటలు సాగనివ్వమని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు పేరం రమేష్‌నాయుడు, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, మునసూరు రామచంద్రారెడ్డి, వేలూరు హరినాయుడు, కేవీ నాయుడు, నూతలపాటి ప్రసాద్‌నాయుడు, రాధానాయుడు, అక్కరపల్లి మాధవరెడ్డి, సిద్దులయ్యనాయుడు, సూరినాయుడు, బైనా సుబ్రహ్మణ్యంరెడ్డి, తాళ్ల యుగందర్, పునబాక పోలయ్య, యాగాని బెన్నీ, ఆరూరు రమణయ్య, మొడాం బాబు, కన్నలి వాసు, పరుశురామమ్ పాల్గొన్నారు.

ఎన్డీఏతోనే దేశ సమగ్రాభివృద్ధి: వరప్రసాద్



సోమిరెడ్డితో కలసి ప్రచారం నిర్వహిస్తున్న వరప్రసాద్

వెంకటాచలం/సర్వేపల్లి, ఏప్రిల్ 15: ఎన్డీఏతోనే దేశ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి వెలగపల్లి వరప్రసాదరావు అన్నారు. సోమవారం నెల్లూరు జిల్లా సర్వేపల్లి నియోజకవర్గంలోని వెంకటాచలం, సర్వేపల్లి గ్రామాల్లో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలసి ప్రచారం నిర్వహించారు. ముందుగా కసుమూరు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం వెంకటాచలం మండలం నిడుగుంటపాళెంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరప్రసాదరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్నీ కేంద్రం మంజూరు చేసినవేనని, వాటికి పేర్లుమార్చి జగన్ గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో వైసీపీకి గుణపాఠం చెప్పి ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో కూటమి నాయకులు కాకుటూరు రవీంద్రారెడ్డి, ఆరుముళ్ల మురళి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మాధవ్, కరీముల్లా, అన్వర్, మౌలానా, పడివేటి శేషయ్య, నలపాలపు వెంకటాద్రి పాల్గొన్నారు.



కసుమూరు దర్గాలో ప్రార్థనలు చేస్తున్న వరప్రసాద్

గూడూరు: పట్టణంలోని తన నివాసంలో వరప్రసాదరావు ఎన్డీఏ కూటమి నాయకుల సమావేశం నిర్వహించారు. వైసీపీలో తాను ఎంతో విశ్వాసంగా పనిచేశానని, అయినా తనను చిన్నచూపు చూశారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించాలని వరప్రసాదరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, పులిమి శ్రీనివాసులు, యారం వెంకటసుబ్బయ్య, పేటేటి చంద్రనీల్, ఇంద్రవర్ధన్, మన్నెం శీనయ్య, బూతు సుబ్రహ్మణ్యం, లక్ష్మీ, సురేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతలకు ఓటమి భయం పట్టుకుంది: నెలవల

నాయుడుపేట, ఏప్రిల్ 15: ఓటమి భయంతో వైసీపీ నేతల పిచ్చి పరాకష్టకు చేరిందని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. నాయుడుపేట శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో సోమవారం మీడియాతో మాట్లాడారు. 2019లో కోడికత్తి తరహా డ్రామాను జగన్ మళ్లీ పునరావృతం చేశారని ఎద్దేవా చేశారు. పూలదండలో ఏదో గీసుకొని స్వల్ప గాయమైతే దానిని హత్యాయత్నంగా చూపడం సిగ్గుచేటని అన్నారు. సీఎంకు రక్షణ లేకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమన్నారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య జరిగి ఐదేళ్లు పూర్తయినా సీఎం ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు.ప్రశాంతంగా ఉండే సూళ్లూరుపేట నియోజకవర్గంలో 2019 నుంచి అరాచకాలు, దాడులు, ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణా, గంజాయి, బియ్యం స్మగ్లింగ్ వంటివి విచ్చలవిడిగా సాగుతున్నాయని ఆరోపించారు. వైసీపీ నాయకులే పరస్పరం దాడులకు దిగడం, దళితులను పావులుగా వాడుకొని అట్రాసిటీ కేసులు పెట్టడం పరిపాటైందన్నారు. పెళ్లకూరులో సత్యనారాయణరెడ్డి, శేఖర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసులు పెట్టి నెలలుకావస్తున్నా ఇప్పటి వరకు పోలీసులు చర్యలు తీసుకోలేదని లేవన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, తెలుగుయువత పార్లమెంట్ ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, మండల ప్రధాన కార్యదర్శి దేవాడి నాగేంద్రరెడ్డి, మొండెం బాబు, కందమూడి శివకుమార్, మాజీ జడ్పీటీసీ శ్రీరామ్‌ప్రసాద్, ఎద్దల ధనంజయరెడ్డి, శిరసనంబేటి రామచంద్రారెడ్డి, పార్టీనాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధుడి మృతి

గూడూరు, ఏప్రిల్ 15: అనుమానాస్పదస్థితిలో వృద్ధుడు మృతిచెందిన సంఘటన గూడూరు పట్టణంలోని చర్చివీధిలో సోమవారం చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసుల కథనం మేరకు... నెల్లూరు జిల్లా మనుబోలు మండలం కొండూరుసత్రం గ్రామానికి చెందిన చిన్నమస్తానయ్య(65) చర్చివీధిలో ఓ ఇంటి నిర్మాణం వద్ద వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం అతను పనిచేస్తున్న ఇంటి సమీపంలో మరో ఇంటి మెట్ల వద్ద తలకు గాయమై రోడ్డుపై పడి మృతిచెందాడు. సంఘటనాస్థలాన్ని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సీఐ పాపారావు పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చిన్నమస్తానయ్యకు భార్య, కుమార్తె ఉన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేత రమణమూర్తి

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15: సూళ్లూరుపేట మండలం దామానెల్లూరు పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నేతలు చెందిన టీడీపీ చేరారు. టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే అభ్యర్థి నెలవల విజయశ్రీ దామానెల్లూరు, డేగవారి కండ్రిగ, సుగ్గుపల్లి గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా డేగవారికండ్రిగకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు పుట్టు రమణమూర్తితో పాటు పలువురు కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, మండల అధ్యక్ష, కార్యదర్శులు కొక్కు శంకరయ్య, పాకం వెంకటసుబ్బయ్య, దేవారెడ్డి సుధాకర్ రెడ్డి, ఉగ్గుముడి సర్పంచ్ తాటిపర్తి శ్రీనివాసుల రెడ్డి, రాజసులోచనమ్మ పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు

పెళ్లకూరు, ఏప్రిల్ 15: పెళ్లకూరు గ్రామానికి చెందిన ఉచ్చూరు ప్రసాద్‌రెడ్డి తన అనుచరులతో వైసీపీని వీడి సూళ్లూరుపేట టీడీపీ ఇంచార్జీ, మాజీఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం సమక్షంలో సోమవారం టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన ఉచ్చూరు ప్రసాద్‌రెడ్డితో పాటు అక్కుపల్లి మస్తానయ్య, కోగిలి రత్నయ్య, కోబాక మునెయ్యలకు నెలవల సుబ్రహ్మణ్యం కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, సీనియర్ నాయకులు పేరం రమేష్‌నాయుడు, బైనా సుబ్రహ్మణ్యం, మొడెం బాబు, వెంకటయ్య, వాకిరి వెంకటేశ్వర్లు, జడపల్లి వెంకటేశ్వర్లు, గుంటపూడి, కొప్పల తిరుమల, కుంపటి సునీల్, పరుశురాం, సురేష్ తదితరులు ఉన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

చిల్లకూరు, ఏప్రిల్ 15: మండలంలోని గ్రామాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో భానుమూర్తిరావు అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం ఓడూరు, ఉడతావారిపాళెంలో గ్రామాల్లో తాగునీటి సమస్యకు పరిష్కార చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



సూళ్లూరుపేటలో మాక్‌డ్రిల్ చేసి చూపిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద అగ్ని ప్రమాదాల నివారణపై ఆశాఖ సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక అధికారి రఘునాథ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో మాక్‌డ్రిల్ చేసి చూపించారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు జరకుండా ఉండేందుకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గూడూరు అర్బన్: అగ్నిప్రమాదాల నివారణపై ప్రజలు అవగాహన కలిగివుండాలని అగ్నిమాపకశాఖ అధికారి చలమయ్య అన్నారు. సోమవారం స్థానిక పాత బస్టాండు, ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్ తదితర ప్రాంతాలలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో అగ్నిప్రమాదాలు జరగకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కోట: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక అధికారి హరీష్ ఆధ్వర్యంలో వంట చేసే సమయంలో గ్యాస్ సిలిండర్ పేలినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ఉదయగిరి నియోజకవర్గ టీడీపీ ఎన్నికల పరిశీలికుడిగా సతీష్‌రెడ్డి



సూళ్లూరుపేట, ఏప్రిల్ 15: టీడీపీ జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డిని ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని ఉదయగిరి నియోజకవర్గ ఎన్నికల పరిశీలికుడిగా ఆ పార్టీ అధిష్ఠానం నియమించింది.

అహల్య శాప విమోచన అలంకారం



సూళ్లూరుపేట, ఏప్రిల్ 15: సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామ నవమి వసంతోత్సవాల్లో భాగంగా సోమవారం బాలాంజనేయస్వామి అహల్య శాప విమోచన అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం మూలవిరాట్‌కు అభిషేకం చేసి పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అదేవిధంగా బ్రాహ్మణవీధిలోని సీతారాముల ఆలయంలో జరుగుతున్న వసంత నవరాత్రుల ఉత్సవాల్లో స్వామివారు కృష్ణ అవతారంలో దర్శనమిచ్చారు.

ఎన్నికల విధులపై శిక్షణ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15: స్థానిక వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్నికల విధులపై సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎన్నికల నియమావళి, నిబంధనల గురించి తహసీల్దార్ గోపాలకృష్ణ వివరించారు. ఎన్నికల విధుల్లో అలసత్వం తగదని, ఈసీ నిబంధనల మేరకు అందరూ పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డీటీ పవన్‌కుమార్, డీటీ చైతన్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్ అధ్యాపకుడికి డాక్టరేట్



వెంకటకొండారెడ్డికి ప్రసంశాపత్రాలు అందజేస్తున్న డైరెక్టర్

కోట, ఏప్రిల్ 15: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్ఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వెంకటకొండారెడ్డికి చెన్నైకు చెందిన సవిత భీముడు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆయనను సోమవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, విభాగాధిపతులు, డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ నారాయణరావు షీల్డ్‌లు, మెమోంటోలతో అభినందించారు.

ముగిసిన సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

కోట, ఏప్రిల్ 15: మండల పరిధిలోని గూడలిలో 11 రోజులపాటు జరిగిన కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం రాత్రి ఏకాంతసేవతో ముగిశాయి.





సోమవారం ఉదయం భానుప్రకాష్ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్న తడుకు పంచాయతీ టీఆర్ కండ్రిగ కాలనీవాసులు - సాయంత్రం మంత్రి రోజా సోదరుడు రాంప్రసాదరెడ్డి సమక్షంలో వైసీపీ కండువా కప్పుకున్న దృశ్యం

అటు.. ఇటు.. అటు

పూటకో పార్టీ కండువా

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 15: పుత్తూరు మండల పరిధిలోని తడుకు పంచాయతీలో కొందరు తరచూ పార్టీలు మారడం పరిపాటిగా మారుతోంది. రెండు వారాల క్రితం పంచాయతీ పరిధిలోని టీఆర్ కండ్రిగ కాలనీకి చెందిన కొందరు స్థానికులు వైసీపీ కండువా కప్పుకున్నారు. తిరిగి సోమవారం ఉదయం తిరుపతిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో ఆ పార్టీ కండువా కప్పుకున్నారు. సాయంత్రం అయ్యే సరికి రామకృష్ణాపురం పంచాయతీలో ప్రచారంలో ఉన్న మంత్రి రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి సమక్షంలో మళ్లీ వైసీపీ కండువాలు కప్పుకోవడంతో స్థానికులు నోరెళ్లబెట్టారు. పార్టీ కండువా కప్పుకుంటే నగదుతోపాటు మద్యం, బిర్యానీ కూడా ఇస్తుండడంతో పూటకో పార్టీ మారుతున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

భారతీయ జ్ఞానపరంపరకు శ్రీమద్రామాయణం దర్పణం

తిరుపతిరూరల్, ఏప్రిల్ 15: భారతీయ జ్ఞానపరంపరకు శ్రీమద్రామాయణం నిధి వంటిదని ఖాట్మాండులోని నేపాల్ సంస్కృత వర్సిటీ ప్రొఫెసర్ పద్మప్రసాద భట్టరాయి పేర్కొన్నారు. సంస్కృత వర్సిటీలో శ్రీమద్రామాయణంలోని భారతీయ జ్ఞానపరంపర అనే అంశంపై నిర్వహించిన రెండ్రోజుల అంతర్జాతీయ సదస్సుకు సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రామాయణంలో అనేక వైజ్ఞానిక అంశాలను వర్ణించడం జరిగిందని, సర్వమానవాళికి అది మార్గదర్శకమని వివరించారు. రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం మాజీ వీసీ ప్రొఫెసర్ హరేకృష్ణ శతపథి మాట్లాడుతూ చతుర్దశ విద్యాస్థానాలు భారతీయ పరంపరకు అత్యంత ముఖ్యమని, శ్రీమద్రామాయణంలో ఈ విషయాలను విశ్లేషించవచ్చని తెలిపారు. కాగా ఈ సదస్సుల్లో పలు దేశాలకు చెందిన దాదాపు 200 మందికిపైగా అధ్యాపకులు పరిశోధనా పత్రాలను సమర్పించారు. వీసీ ప్రొఫెసర్ జీఎస్ఆర్ కృష్ణమూర్తి, అకడమిక్ డీన్ ప్రొఫెసర్ టీవీ రాఘవాచార్యులు, సాహిత్య సంస్కృతి అధ్యక్షురాలు ప్రొఫెసర్ సి.లలితారాణి, కోఆర్డినేటర్ ప్రొఫెసర్ కె.రాజగోపాలన్, ప్రొఫెసర్ సి.రంగనాథన్ పాల్గొన్నారు.

ఒంటిమిట్టకు ప్రత్యేక ప్యాకేజీ టూర్

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 15: శ్రీరామనవమిని పురస్కరించుకుని ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఒంటిమిట్టకు ప్రత్యేక ప్యాకేజీ టూర్ ఏర్పాటు చేసినట్లు పర్యాటకాభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ గిరిధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒంటిమిట్ట(రామాలయం), నందలూరు(సౌమ్యనాథ స్వామి ఆలయం)లకు నాన్ ఏసీ రవాణా, మధ్యాహ్న భోజనం, గైడ్ ఛార్జీలతో కలిపి ఒక్కొక్కరికి రూ.600 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. 17నుంచి 22వ తేదీ వరకు ఈ ప్యాకేజీ అందుబాటులో ఉంటుందని తెలిపారు. వివరాలకు 9848850099, 9848884299, 9848973985లను సంప్రదించాలని కోరారు.

జంక్ ఫుడ్స్‌తో ఆరోగ్య సమస్యలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 15: జంక్ ఫుడ్స్ తినడం వల్ల ఆరోగ్య సమస్యలు వస్తాయని యోగా నిపుణులు డాక్టర్ ముని మంజుల తెలిపారు. ఆరోగ్యంపై పద్మావతి యూనివర్సిటీలో సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో ముని మంజుల మాట్లాడుతూ శారీరక వ్యాయామం, యోగా ద్వారా అనేక సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. సైకాలజిస్టు డాక్టర్ గాయత్రి మాట్లాడారు.

తిరుమల ఘాట్‌లో అదుపుతప్పిన కారు

ముగ్గురు భక్తులకు స్వల్ప గాయాలు

తిరుమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల రెండవ ఘాట్ రోడ్డు(అప్ ఘాట్)లో సోమవారం ఓ కారు అదుపుతప్పి క్రాష్ బారియర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ముగ్గురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం శ్రీవారి దర్శనార్థం సోమవారం తిరుమలకు బయలుదేరింది. మార్గంలోని హరిణి ప్రాంతంలో కారు అదుపుతప్పి క్రాష్ బారియర్‌ను ఢీకొంది. కారులోని ముగ్గురు భక్తులకు స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు భాగం ధ్వంసమైంది. అధికారులు అప్రమత్తమై కారును పక్కకు తొలగించారు. టైర్ పగలడంతోనే ప్రమాదం జరిగిందని భక్తులు తెలిపారు.